


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 27.11.2025 | సంపుటి : 2 | సంచిక :293 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 27.11.2025 | volume : 2 | Issue : 293 | Pages : 8 | Cost : 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


## కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం

దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు

అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు

19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం

రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్

కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ, నవంబర్ 26 : దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాం తాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు సహా మె-ుత్తం రూ. 19,919

- మిగతా 2 లో..



## జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

వర్చువల్‌గా ప్రారంభించిన మోడీ.. అభినందనలు తెలియచేసిన సిఎం రేవంత్

**తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్ లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన నెలకొల్పుతున్న సెంటర్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.**

హైదరాబాద్,నవంబర్ 26 : ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో సాఫ్రాన్ ఇంజిన్‌ల మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (ఎంఆర్‌ఓ)సెంటర్ అని తెలిపారు. రూ.1,300 కోట్ల

- మిగతా 2 లో..

## భయాన్ని బలహీన పరుస్తున్నారు

పదేపదే రాయితీలు ఇవ్వడమేంటి?

రాయితీలు ఇవ్వడం సరికాదు

ట్రాఫిక్ క్రమశిక్షణరాహిత్యాన్ని పెంచుతుంది

ట్రాఫిక్ చలాన్ల డిస్కౌంట్లపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 25 : ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం ఈ మధ్య వాహనాల రకాన్ని బట్టి.. 75 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్న విష యం తెలిసిందే. పేరుకు పోయిన పెండింగ్ చలాన్ల బకాయిలను రికవరీ చేసుకునేం దుకు.. ప్రభుత్వం

- మిగతా 2 లో..

## బీసీలకు 42% రిజర్వేషన్లు రావు

కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా

జనరల్ స్థానాలన్నింటిలో బీసీలు పెద్దఎత్తున నామినేషన్లు వేయాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబర్ 26 : అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని

- మిగతా 2 లో..




## ఫిబ్రవరి 25 నుండి ఇంటర్ పరీక్షలు

పొరపాట్ల సవరణకు బోర్డు కొత్త మార్గదర్శకాలు

30 వరకు నామినల్ రోల్స్ లో తప్పులు సరిచేసుకునే అవకాశం

తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపనున్న ఇంటర్ బోర్డు

02

## సీఎం రేవంత్ అవినీతి అనకొండ

మున్సిపాలిటీల విలీనం దారుణం

మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వరంగల్, నవంబర్ 26 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నదమ్ములు, అను యాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొ రేషన్లను జీహెచ్ఎంసీ లో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా

- మిగతా 2 లో..



## ఐబొమ్మ కేసులో బిగ్ ట్విస్ట్!


రవి సినిమాలు పైరసీ చేయలేదు

విచారణలో కీలక షయాలు



హైదరాబాద్, నవంబర్ 25 : తెలుగు సినీ పరిశ్రమ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టి పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ కేసులో విచారణ వేగంగా కొనసాగు తోంది. ఐదురోజుల పోలీసు కస్టడీలో సైతం నిందితుడు

- మిగతా 2 లో..



## వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

పశ్చిమ-వాయువ్య దిశగా పయనం

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన

## ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం రివాల్వర్ కుదువ

రికవరీ సొత్తు, రివాల్వర్ తాకట్టుపెట్టిన ఎస్ఐ

ఎస్ఐపై సస్పెన్షన్ వేటు



హైదరాబాద్, నవంబర్ 25 : దొంగతనం కేసులో స్వాధీనం చేసుకున్న బంగా రాన్ని క్రైం ఎస్సై వడ్డీ వ్యాపా రి వద్ద కుదువ పెట్టిన ఉ దంతమిది. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బానిసైన ఎస్సై డబ్బుల కోసం బంగారాన్ని

- మిగతా 2 లో..




## తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 26 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులా తండాలో సర్పంచ్ పదవికి

- మిగతా 2 లో..

## దేశీయ స్టాక్ మార్కెట్లలో సరికొత్త జోష్

1022 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

320 పాయింట్లకు పైగా పెరిగిన నిఫ్టీ



07

## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు త్వరలో కార్యరూపం

త్వరగా స్థలాల ఖరారు చేయాలని కోరిన రైల్వేశాఖ



04

## మరోసారి తగ్గిన బంగారం ధరలు



04

# జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)



ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కొత్త సదు–పాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో రాజూస్రా ఇంజిన్‌ల మొట్టమొదటి మె–యింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (వీ=రా)సెంటర్ అని తెలిపారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ స్థానిక ఎంఎస్‌ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీ లకు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఇవాళ సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ఈ ఎమ్ఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్.. భారతదేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500 కి పైగా ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని సీఎం తెలిపారు. భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు గత ఏడాది రెట్టింపు అయ్యాయన్నారు. 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమని చెప్పుకొచ్చారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను (ఐటీఐఎస్) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు. 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047 – గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. బెంగళూరు–హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాటు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

## కేంద్ర కేబినెట్
# సంచలన నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)



కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్–కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్ లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం. ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది. భారతదేశంలో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ కొత్త ప్రణాళిక భారతదేశంలో అరుదైన–భూమి అయస్కాంతాల ఉత్పత్తికి పూర్తి దేశీయ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ప్రస్తుతం, ఈ రంగంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. ఈ నిర్ణయం భారతదేశాన్ని స్వావలంబన చేస్తుంది. గుజరాత్ యాత్రికులకు కూడా కేంద్రం శుభవార్త తెలిపింది. ఓఖా నుండి కనాలస్ రైల్వే లైన్‌ను డబుల్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 1,457 కోట్లు ఖర్చవుతుంది. 159 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్ దేవభూమి ద్వారకకు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచుతుంది. ఈ లైన్‌ను రెట్టింపు చేయడం వల్ల సరుకు రవాణా రైళ్లు వేగంగా నడపడానికి వీలు కలుగుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నాలుగు నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19,919 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఒకే రోజులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. ఇది రైల్వే, మెట్రో ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంది కేంద్రం. రేర్ ఎర్త్ పథకం దేశ సాంకేతికతకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు

(మొదటిపేజీ తరువాయి)

జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. గ్రామస్థులంతా కలిసి సంబరాలు చేసుకుంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. తన విజయంపై స్పందించిన సర్పంచ్ జవహర్ లాల్ నాయక్.. గ్రామ ప్రజలు చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పంచాయతీ పరిధిలో అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తండా అభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల, ప్రజల కోరికలను నెరవేర్చడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

## రవి సినిమాలు
# పైరసీ చేయలేదు

(మొదటిపేజీ తరువాయి)



రవి వద్ద నుంచి కీలక సమాచారాన్ని తెలంగాణ పోలీసులు రాబట్టారు. మరి కొన్ని విషయాల్లో ఇంకా క్లారిటీ రావాల్సిన అవసరం ఉంది. తాజా మరో వారం రోజులపాటు పోలీసు కస్టడీ కోరుతూ నాంపల్లికోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. తాజాగా నిందితుడు రవి ఏ సినిమాలు పైరసీ చేయలేదంటూ మరో బాంబు పేల్చారు పోలీసులు. ఐబొమ్మ, బప్పం పైరసీ వెబ్ సైట్‌ల ద్వారా చట్టవిరుద్ధంగా సినిమాలను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు, ఆయా వెబ్ సైట్ల ద్వారా గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించిన మాట వాస్తవమేనని, కానీ అప్పుడే విడుదలైన కొత్త సినిమాలను పైరసీ చేయడంలో ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవికి ఎటువంటి ప్రమేయం లేదని తేల్చినట్లు సమాచారం. మూవీ రూల్స్ , తమిళ్ ఎంవీ ద్వారా పైరసీ సినిమాలను కొనుగోలు మాత్రమే రవి చేసేవాడని, అలా కొనుగోలు చేసిన కొత్త సినిమాలు క్వాలిటీ తక్కువగా ఉండేవని, అలా పూర్ క్వాలిటీతో కొన్న పైరసీ సినిమాలను టెక్నాలజీ ఉపయోగించి, హెచ్ డీ క్వాలిటీలోకి మార్చి ఐబొమ్మ, బప్పం వెబ్ సైట్‌లో పోస్ట్ చేసేవాడని తేల్చారు. దీంతో సినిమా పైరసీ కేసుల నుంచి ఐబొమ్మ రవికి కాస్త ఊరట లభించినట్లయ్యింది. కానీ గేమింగ్ యాప్‌లు ప్రమోట్ చేయడం, బెట్టింగ్ యాప్ లను తన వెబ్ సైట్ ల ద్వారా ప్రమోట్ చేయడం ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించడంతో రవి అడ్డంగా బుక్కైనట్లయ్యింది. ఐబొమ్మ రవి పోలీసులకు చిక్కడానికి కారణం తన గొయ్యి తానే తవ్వుకోవడం. తన డొమైన్‌ను తన సొంత అడ్రస్, ఈమెయిల్ ఐడీ, క్రెడిట్ కార్డు ఉపయోగించి కొనుగోలు చేయడమే రవి ఈజీగా ఖాకీలకు చిక్కేలా చేసింది. మొదట ఎన్‌జలా అనే కంపెనీ ద్వారా డొమైన్ రిజిస్ట్రేషన్ చేసిన రవి, ఐపీ వాల్యూమ్ అనే కంపెనీ ద్వారా హోస్టింగ్ వ్యవహారాలు మ్యానేజ్ చేసేవాడు. కంటెంట్ మ్యానేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఈ మొత్తం వ్యవస్థను నడిపించేందుకు ఔట్ సోర్సింగ్ టీమ్ ఏర్పాటు చేసినట్లుగా నిర్ధారించారు. ఇలా వీళ్లెవరికీ రవితో సంబంధాలు లేవు. ఎవరెవరు, ఎక్కడి నుంచి ఎవరి కోసం పని చేస్తున్నారో తెలియకుండా ఈ మొత్తం వ్యవహారం నడిపించాడు. ఐబొమ్మ వెబ్ సైట్‌లోకి వెళ్లి సినిమా లింక్‌పై క్లిక్ చేయగానే వెంటనే యూజర్స్ ను గేమింగ్ యాప్, బెట్టింగ్ యాప్‌లకు రీడైరెక్ట్ చేసేలా బప్పం, ఐబొమ్మ పైరసీ వెబ్ సైట్లను డిజైన్ చేశాడు. అలా యూజర్ ఎంగేజ్మెంట్ ఆధారంగా బెట్టింగ్, గేమింగ్ యాప్ కంపెనీలు రవికి డబ్బులు చెల్లించేవి. లక్ష వ్యూవర్స్‌కు ఇంత మొత్తంలో డబ్బు చెల్లించేలా ముందుగానే మాట్లడుకునేవాడు. అలా ఆయా కంపెనీల నుంచి వచ్చిన డబ్బును ఇండియాలో తన బ్యాంక్ అకౌంట్‌కు మళ్లించేవాడు. అలా వచ్చిన డబ్బును వచ్చినట్లు మంచినీళ్లలా విదేశీ పర్యటనల కోసం ఖర్చు చేసేవాడట. ఇలా పైరసీ సినిమాలు మాత్రమే కొనలేదుకానీ, మిగతా చట్టవిరుద్ధమైన గేమింగ్ యాప్ ప్రమోషన్‌లతో కోట్లు దండుకోవడం నిందితుడి కొంపముంచింది.

## కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా
# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు

(మొదటిపేజీ తరువాయి)



ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు. 21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు. ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపైనో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.

# ఫిబ్రవరి 25 నుండి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, నవంబర్ 26 :** తెలంగాణ రాష్ట్రంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత వివరాలు తప్పుగా నమోదు కావడం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. పేరు, తండ్రి పేరు, గ్రూపు, మాధ్యమం, భాషా సబ్జెక్టులు వంటి కీలక అంశాల్లో తేడాలు రావడం వల్ల పరీక్ష సమయాన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. గతంలో పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు ఓఎంఆర్ పత్రాల్లో తప్పులు సవరించుకునే అవకాశం ఉండేది. చాలా సందర్భాల్లో తెలుగు స్థానంలో హిందీ ముద్రించబడడం, గ్రూప్ మారడం, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా రావడం వంటి సమస్యల్ని అప్పటికప్పుడు సరిచేసుకునే అవకాశం ఉండేది. అయితే ఈసారి పరీక్ష కేంద్రాల్లో అలాంటి అవకాశం ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనికి బదులుగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షలకు ముందుగానే వివరాల సవరణకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం డీఐఈవోలకు మరియు కాలేజీ ప్రిన్సిపాళ్లకు బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి కాలేజీ ప్రిన్సిపాళ్లు నామినల్ రోల్స్‌ను చూపించి, అందులో ఉన్న అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కాలేజీలకు పిలిపించి వివరాలను క్రాస్ చెక్ చేయించి సంతకాలు తీసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ ద్వారా ఓఎంఆర్ పత్రాల్లో వచ్చే పొరపాట్లను ముందుగానే పూర్తిగా నివారించవచ్చని బోర్డు భావిస్తోంది. అంతేకాక, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో చదువుతున్న దాదాపు 10 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పరీక్షల ఫీజులు, గడువులు, నామినల్ రోల్స్ పరిశీలన, ప్రాక్టికల్స్ షెడ్యూల్ వంటి సమాచారాన్ని ఎస్ఎంఎస్‌ల రూపంలో పంపించాలనే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు నవంబర్ 30 వరకు తమ నామినల్ రోల్స్‌లో ఉన్న పొరపాట్లను సవరించుకునే అవకాశం కల్పించింది. ఫీజు గడువు ముగిసిన తరువాత కూడా మరోసారి సవరణ అవకాశం ఇవ్వనున్నట్లు బోర్డు తెలిపింది.

# అవినీతి అనకొండ సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)



స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది. అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు. 'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్సిపాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు. అఖిలపక్ష సమావేశం పెట్టి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకున్నారా ? శాసనసభ పెట్టి సభ్యుల అభిప్రాయం తీసుకున్నారా అంటే అదీ లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం, ఎవరి శాశ్వత దీర్ఘకాలిక ఆలోచనల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందో మాకైతే తెలియడం లేదు. ఏ కారణం చేత ఈ ప్రతిపాదనను తెచ్చారో కూడా స్పష్టంగా లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే ఈ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది' అన్నారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో కొత్త పాలసీని తీసుకువచ్చారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు అపార్ట్‌మెంట్లకు ఇస్తున్నారు. గతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ప్రజలను ఒప్పించి, ఉపాధి అవకాశాల కోసం భూములను సేకరించిన తీరుగానే, గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో 9,300 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించాయి. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకి భూములు తీసుకొని, వారికి తక్కువ ధర ఇచ్చి, సబ్సిడీపై పరిశ్రమలకు భూములిచ్చిన తర్వాత పరిశ్రమలు నడవాలి. ఉపాధి దొరకాలి. యువతకు ఉద్యోగాలు రావాలి. రాష్ట్ర ఆదాయం పెరగాలని మేము ఆశిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారి వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. హైదరాబాద్‌లోని పరిశ్రమల యజమానులు వచ్చి,అపార్ట్‌మెంట్లు కట్టుకుంటాం, మాల్స్ కట్టుకుంటాం అంటే.. వారికి అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రిజిస్ట్రేషన్ ధరకు కాకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30శాతం మాత్రమే చెల్లించి, భూమిని కన్వర్ట్ చేసుకోవడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు' అని ఆరోపించారు. 'హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో పార్కులకు, పార్కింగ్‌లకు, బొందలగడ్డలకు, ఇల్లు కట్టుకోవడానికి జాగా లేదు. వీటికి జాగాలు వద్దట. కానీ, పారిశ్రామికవేత్తలు అడ్డికి పావుశేరుకు కొనుక్కున్న, ప్రభుత్వం ఇచ్చిన భూములను వారు ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటే మాత్రం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపుతున్నారు. 9,300 ఎకరాల భూమి దాదాపు రూ.5లక్షల కోట్ల విలువైన ఆస్తి. దేశంలోని ఇతర రాష్ట్రాలు (ఉదాహరణకు ముంబయి) మిల్స్ కోసం ఇచ్చిన భూములను 50శాతం వెనక్కి తీసుకొని, ప్రజల అవసరాల కోసం వినియోగిస్తున్నాయి. రేవంత్ రెడ్డి 'అవినీతి అనకొండ' అని.. రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు, ఆయన అనుయాయులతో కలిసి ఒక అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ అవినీతి అనకొండ విశ్వరూపం ఏమిటంటే..రూ.5 లక్షల కోట్లు విలువైన తెలంగాణ ప్రజల ఆస్తిని దోచుకుపోవడానికి, ఉద్దేశపూర్వకంగా గత ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు.




# భయాన్ని బలహీనపరుస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించింది. ఇంటిగ్రేటెడ్ ఈ–చలానా వ్యవస్థను సవాల్ చేస్తూ హైదరాబాద్ తార్నాకకు చెందిన వి. రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ.. ట్రిపుల్ రైడింగ్‌కు 1988 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం.. రూ. 100 నుంచి రూ. 300 మాత్రమే జరిమానా విధించాలి. కానీ దీనికి విరుద్ధంగా 2019 నిబంధన ప్రకారం.. రూ. 1000 విధిస్తున్నారని.. ఇది చెల్లదని వాదించారు. 2019లో సవరణ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అన్వయించుకోకపోవడంతో.. 1988 నిబంధనల ప్రకారమే చలానా జారీచేయాల్సి ఉందన్నారు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె తమ వాదనలు వినిపించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 200 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలనేవి జరిమానా విధించదగ్గ నేరాలని తెలిపారు. అందుకు సంబంధించిన జరిమానాల వివరాలను వెల్లడిస్తూ ప్రభుత్వం 2007 జీవో 54 జారీ చేసిందని హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వం జరిమానాను పెంచుతూ 2011లో ఉత్తర్వులు జారీ చేసిందని.. ప్రస్తుత చలానా వ్యవస్థలో నిబంధనలన్నీ పొందుపర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రాఫిక్ ఉల్లంఘన జరిగినప్పుడు అది ఏ చట్టంలోని ఏ సెక్షన్ కింద ఉల్లంఘనగా పరిగణించబడిందనే వివరాలను చలానా జారీ సమయంలో స్పష్టంగా పొందుపరచ గలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలు, వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉందో సమగ్ర నివేదికను డిసెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు హోంశాఖను ఆదేశించింది. ఈ సాంకేతిక మెరుగుదల కేంద్ర మోటారు వాహన నిబంధన 167 ప్రకారం తప్పనిసరి అని న్యాయమూర్తి గుర్తు చేశారు.

# రికవరీ సొత్తు, రివాల్వర్ తాకట్టుపెట్టిన ఎస్ఐ!

(మొదటిపేజీ తరువాయి)

కుదువపెట్టినట్లు విచారణలో తేలింది. సదరు ఎస్సై సర్వీస్ రివాల్వర్ పోయిన ఘటనపై విచారణ జరుగుతోంది. హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై పోలీస్ తూర్పు మండలం డీసీపీ బాలస్వామి వివరాల ప్రకారం... ఏపీలోని రాయచోటికి చెందిన భానుప్రకాష్ 2000 బ్యాచ్ ఎస్సైగా ఎంపికయ్యారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న అతను గత కొన్నేళ్లుగా అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్నారు. కొంత కాలం సెక్టార్ ఎస్సైగా పనిచేసిన అతన్ని క్రైం విభాగం ఎస్సైగా మార్చారు. పటేల్‌నగర్‌లో ఇంటి పని మనిషి దొంగతనం కేసులో 4.3 తులాల దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నారు. కోర్టు విచారణలో ఉన్న ఈ కేసు లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. దీంతో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని యజమానికి అప్పగించే క్రమంలో అది కనబడటం లేదని తేలింది. విచారించిన అధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బుల కోసం బంగారాన్ని నారాయణగూడలోని మార్వాడీ దుకాణంలో కుదువ పెట్టినట్లు వెల్లడైంది. ఈ మేరకు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని సర్వీస్ రివాల్వర్ పోయిన విషయమై విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో అతన్ని నాలుగు రోజుల క్రితమే విధుల నుంచి తొలగించినట్లు (సస్పెండ్ చేసినట్లు) కాచిగూడ డివిజన్ ఏసీపీ హరీశ్‌కుమార్ తెలిపారు.

# పవర్ ప్రాజెక్టుల్లో రూ.50వేల కోట్ల అవకతవకలు

- ఎన్టీపీసీ చౌక విద్యుత్ ఎందుకు తిరస్కరించారు
- ప్రతి నిర్ణయంలో కమీషన్.. ఇదే రేవంత్ పాలన"
- రేవంత్ ప్రభుత్వంపై మరోసారి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్, నవంబర్ 26 :** హరీష్ రావు మళ్ళీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఘాటు విమర్శలు చేశారు. ఇప్పటికే ల్యాండ్ స్కాం బయట పెట్టిన తమ పార్టీ, ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న పవర్ స్కాంను వెలుగులోకి తీసుకురానున్నట్లు ఆయన ప్రకటించారు. అక్షరాల రూ.50 వేల కోట్ల భారీ మోసం జరుగుతోందని, దీనిలో 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో విధాన నిర్ణయాల కోసం నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాలు, ఇప్పుడు పంపకాల కోసం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశాలు వరుసగా భూ స్కాం, పవర్ స్కాం కోసం జరిగాయని ఆయన విమర్శించారు. తమ పార్టీ ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల ల్యాండ్ స్కాం ను బయట పెట్టినా, ప్రభుత్వం దానిపై ఒక్క సమాధానం కూడా చెప్పలేదని హరీష్ రావు మండిపడ్డారు. రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో రూ.50 వేల కోట్ల భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "రేవంత్ ప్రభుత్వం చేసే ప్రతి పనిలో ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమిషన్" అని వ్యాఖ్యానిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలలో ప్రజల ప్రయోజనం కంటే స్వప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అరాచకం రాజ్యమేలుతుందని కేసీఆర్ గతంలో చెప్పిన విషయం ఇప్పుడు నిజమవుతోందని హరీష్ వ్యాఖ్యానించారు. వాటాల విషయంలో తలెత్తిన అంతర్గత తగాదాల వల్ల మంత్రులే రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే వెంటనే డర్టీ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని ఆరోపించారు.ఎన్టీపీసీ తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు సిద్ధంగా లేఖ రాసినా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్టీపీసీ ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దామరచర్లలో పవర్ ప్లాంట్ నిర్మాణంపై గతంలో తీవ్రంగా విమర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇప్పుడు ఎందుకు మోనంగా ఉన్నారని ప్రశ్నించారు. "కమీషన్ కోసమే కోమటిరెడ్డి పెదవులు మూసుకున్నారా?" అని హరీష్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. పథకాల అమలుకు డబ్బుల్లేవని ప్రభుత్వం చెప్పుకుంటూనే, వేల కోట్లతో 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్లను డబుల్ కాస్ట్‌తో నిర్మించడం అంటే కమీషన్ల కోసం చేస్తున్న ప్రాజెక్టులేనని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతి రోజు తన మాటలను మార్చుకుంటారని, 'రామ్-రెమో' లెక్క రోజుకో కొత్త కథ చెబుతున్నారని హరీష్ వ్యాఖ్యానించారు.




## పంచాయతీ రిజర్వేషన్లపై హైకోర్టులో పిటిషన్లు

### విచారణ రేపటికి వాయిదా

**హైదరాబాద్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జీవోకు విరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయిస్తున్నారంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖల య్యాయి. వేర్వేరుగా దాఖలైన 9 పిటిషన్లపై జస్టిస్ టి.మాధవి దేవి విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు 17 శాతానికి మించడంలేదని సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రామసానిపల్లికి చెందిన మాజీ సర్పంచి ఆగమయ్య పిటిషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 613 గ్రామ పంచాయతీలుండగా.. 117 సర్పంచి స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గెజిట్ 43ను జారీ చేశారని వాదించారు. దీని ప్రకారం బీసీ రిజర్వేషన్లు 19శాతం మాత్రమే ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులకు బీసీ రిజర్వేషన్లు 17శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 46కు విరుద్ధంగా ఈ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. సంగారెడ్డి కలెక్టర్ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేసి.. రిజర్వేషన్లు మళ్లీ కేటాయించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ మండలం తిమ్మనోనిపల్లి రిజర్వేషన్లపై మరో పిటిషన్ దాఖలైంది. గ్రామంలో 8 వార్డులుండగా అన్నింటినీ ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారని.. బీసీ జనాభా ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచుల రిజర్వేషన్లు కేటాయించినట్లు స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి కోర్టుకు తెలిపారు. రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు మారుతూ వస్తాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 2011 జనాభా గణనలో తప్పులున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారని.. దీనికి కేంద్రమే సమాధానం చెప్పాల్సి ఉందని రాహుల్ రెడ్డి వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

## చీరల పంపిణీపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

### మంత్రి సీతక్క ఆగ్రహం



**హైదరాబాద్, నవంబర్ 26 :** రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమంపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదంటూ రాష్ట్ర మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలను ఇస్తున్నామని.. దీనిపై బీఆర్ఎస్ నాయకులు కలర్ బాగాలేదని, డిజైన్ బాగాలేదని విమర్శలు గుప్పించడం సరికాదన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే హరీశ్ రావులపై తీవ్రంగా ధ్వజమెత్తారు సీతక్క. సహజంగానే ఆడవాళ్లు ఎదుగుతుంటే.. వాళ్లిద్దరూ ఓర్వలేకపోతున్నారన్నారు. ఆడబిడ్డలు చీరలు తీసుకుని ఎంతగానో సంబరపడుతుంటే అవి వాళ్ల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళలు సంతోషంగా ఉండటంతో వారు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గతంలో ఇచ్చినట్టుగా.. తామేమీ సూరత్ నుంచి కిలోల లెక్కన తీసుకురాలేదని, సిరిసిల్ల నేతన్నలు తమ చేతులతో స్వయంగా నేసిన చీరలనే పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. కావాలంటే కేటీఆర్, హరీశ్ రావు, కవితలు.. సిరిసిల్ల వెళ్లి అక్కడి చేనేత కార్మికులను అడిగి వివరాలు తెలుసుకోవచ్చని స్పష్టం చేశారామె. కాంగ్రెస్ ప్రభుత్వం..ఎంతో నాణ్యతతో కూడిన చీరలను పంచుతుంటే బీఆర్ఎస్ కార్యకర్తలు కావాలనే అవి బాగాలేవని మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలను అవమానించినట్లు అవుతుందన్నారు.చీరల్ని కొందరికే ఇస్తున్నామన్న బీఆర్ఎస్ నేతల ఆరోపణల్ని ఖండించిన మంత్రి.. మహిళా సంఘాల సభ్యులతో పాటు సభ్యత్వంలేని మహిళలనూ సంఘంలోకి ఆహ్వానిస్తూ చీరలు అందజేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఏం చేసినా.. ప్రతిపక్ష నేతలు ఓర్చుకోవడం లేదని ఆమె మండిపడ్డారు. అలాగే ఫ్రీ బస్సు పెడితే బ్రేక్ డాన్స్ చేసుకోవాలని, మహిళలు కొట్టుకుంటున్నారని దుష్ప్రచారం చేశారని ఆమె గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా బుద్ధి మార్చుకుంటే బావుంటుందని సూచించారామె. మహిళలకు మంచి జరుగుతుంటే స్వాగతించడం, సంతోషించడం నేర్చుకోవాలని హితవు పలికారు.

## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణం

### హజరైన మంత్రులు, ప్రముఖులు



**హైదరాబాద్, నవంబర్ 25 :** తెలంగాణలో ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల హాడావిడి మొదలైంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిజర్వేషన్ ల అంశం మీద వాయిదా పడ్డ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎట్టకేలకు తెలంగాణ ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశ డిసెంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత డిసెంబర్ 14, మూడో దశలో డిసెంబర్ 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు జరిగిన రోజు మధ్యాహ్నం తర్వాత ఎన్నికల అధికారులు రిజల్ట్ ను ప్రకటిస్తారు.మరోవైపు సర్పంచ్ ఎన్నికలపై ఇప్పటికే కేటీఆర్ కాంగ్రెస్ పై పంచ్ లు వేశారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందంటూ ట్విట్ చేశారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో సర్పంచ్ ఎన్నికలపై కూడా అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. మరోవైపు ఇటీవల జూబ్లిహిల్స్ బై పోల్స్ లో 25 వేల భారీ మెజార్టీతో గెలిచిన నవీన్ యాదవ్ ఈ రోజు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే విధంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ నవీన్ యావత్ తో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంకు మంత్రులు శ్రీధర్ బాబు, అజరుద్దీన్ తో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వీహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందారు. ఎన్నికల అధికారులు నవీన్ యాదవ్ గెలుపుని అధికారికంగా ప్రకటించారు. మరోవైపు.. తనపై ఎంత చెడుగా ప్రచారం చేసిన కూడా భారీ మెజార్టీతో గెలపించిన ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజక వర్గంను రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని నవీన్ యాదవ్ చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే నవీన్ యాదవ్ ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దల ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.

## మొరాయించిన గూగుల్ మీట్..

### దేశవ్యాప్తంగా నిలిచిపోయిన సేవలు

**న్యూఢిల్లీ, నవంబర్ 26 :** ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫాం గూగుల్ మీట్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా వేలాది మంది వినియోగదారులు ఆన్‌లైన్ సమావేశాల్లో చేరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాగిన్ సమస్యలతో పాటు, చాలామందికి "502 ఎర్రర్" అనే సందేశం కనిపిస్తుండటంతో గందరగోళం నెలకొంది. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'డౌన్‌డిటెక్టర్' నివేదిక ప్రకారం, సుమారు 65 శాతం మంది యూజర్లు వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయలేకపోతున్నారు. మరో 33 శాతం మంది సర్వర్ కనెక్షన్ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ సమస్య ప్రధానంగా భారత్‌లోని వినియోగదారులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి కూడా కొందరు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అంతరాయంపై గూగుల్ స్పందించింది. తమ సర్వీసుల్లో సమస్య తలెత్తినట్లు కంపెనీ స్టేటస్ డ్యాష్‌బోర్డులో నిర్ధారించింది. అయితే, సమస్యకు గల కారణాలు, పరిష్కారానికి పట్టే సమయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సాంకేతిక లోపం కారణంగా ఆఫీస్ మీటింగ్‌లు, ఆన్‌లైన్ క్లాసులు, ఇతర వర్చువల్ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో చాలామంది ఇతర ప్రత్యామ్నాయ ప్లాట్‌ఫామ్‌ల వైపు చూడాల్సి వచ్చింది.

## హైదరాబాద్‌లో బోర్డు తిప్పేసిన ఐటీ సంస్థ

- ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 లక్షలు వసూలు
- సుమారు 400 మంది నుంచి డబ్బులు వసూలు

**హైదరాబాద్, నవంబర్ 25 :** హైదరాబాద్ నగరంలో మరో ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాల పేరిట ఒక్కో విద్యార్థి, నిరుద్యోగి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసి కంపెనీ డైరెక్టర్ పరారైనట్లు తెలుస్తోంది. మాదాపూర్‌లోని ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ కంపెనీ సుమారు 400 మంది నుంచి డబ్బులు వసూలు చేసింది.రూ.3 లక్షలు చెల్లిస్తే శిక్షణ ఇచ్చి, ఉద్యోగం ఇస్తామని ఈ సంస్థ నమ్మబలికింది. దీంతో వందలాది మంది డబ్బులు చెల్లించారు. విద్యార్థులను మోసం చేసి వసూలు చేసిన డబ్బులతో కంపెనీ డైరెక్టర్ స్వామినాయుడు పరారయ్యాడు. దీంతో బాధితులు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు.

## పంచాయతీ ఎన్నికలో జాక్‌పాట్

**వికారాబాద్, నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓ కుటుంబానికి జాక్‌పాట్ తగిలింది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మతన్ గౌడ్ గ్రామంలో సర్పంచి అభ్యర్థి ఎస్టీ రిజర్వేషన్ ఖరారైంది. గ్రామంలో కుటుంబం ఒక్కటే ఉండటంతో ఆ కుటుంబానికి జాక్‌పాట్ తగిలింది. గ్రామంలో 494 మంది ఓటర్లు 8 వార్డులు ఉన్నాయి. గ్రామంలో ఎరుకలి భీమప్పకు అవకాశం దక్కడంతో వారి ఆనందానికి అవధులే వేరు.. ఎరుకల భీమప్ప, భార్య వెంకటమ్మ గ్రామంలో చీపుర్లు, బుట్టలు అల్లి జీవనం సాగిస్తున్నారు.. భీమాప్పకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్ళు ఉన్నారు. ఎల్లప్ప, మహేష్ కోడళ్ళు సప్న, సుజాత.. వీరు నగరంలో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు.. సర్పంచీ పదవితో పాటు ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళ రెండు వార్డుల స్థానాలు కూడా ఆ కుటుంబానికే దక్కబోతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు వారి కుటుంబ పరిస్థితులు మార్చబోతున్నాయని గ్రామంలో చర్చ నడుస్తోంది. ఈ ఆసక్తికరమైన విషయం జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది.


## నకిలీ ఐఏఎస్‌గా అవతారం

### ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు

**హైదరాబాద్, నవంబర్ 26 :** ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్‌ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిదంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ.10.50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. కేటాయింపు జరిగిందని చూపించిన స్థలం తన పేరుపై బదిలీ కాకపోవడంతో అలీ హసన్‌కు ఇతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శశికాంత్‌ను అరెస్టు చేసి రెండు చరవాణులు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలు, నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి గన్‌మెన్లుగా వ్యవహరించిన తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను అరెస్టు చేయాల్సి ఉందని డీసీపీ శ్రీనివాస్ చెప్పారు.

## నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలా?

- విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటు
- ఇలాగైతే రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది
- తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు



**హైదరాబాద్, నవంబర్ 26 :** రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ, ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు తాము ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కనీసం రహదారిపైకి మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని నాగారం మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సదరు మద్యం దుకాణం యజమానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## చెక్ డ్యామ్ ధ్వంసంపై విచారణ ముమ్మరం

**జమ్మికుంట, నవంబర్ 25 :** జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలోని మానేరు వాగు పై నిర్మించిన కొత్త చెక్ డ్యామ్ ధ్వంసం అయింది. ఇసుక మాఫియా బ్లాస్టింగ్‌తో ధ్వంసం చేసినట్లు ఇరిగేషన్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవానికి ముందే ఈ టన జరిగింది. 90 మీటర్ల పొడవు పగుళ్లు, మూడు చోట్ల బ్రీచ్‌లు ఏర్పడ్డాయి. ప్రభుత్వానికిరూ. 3 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ద్వారా 3,000 ఎకరాల ఆయకట్టు ప్రభావితమవుతుందని, వెంటనే 100 ఎకరాల్లో పంటలు నాశనం కావచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫోరెన్సిక్ టీమ్, నిపుణులు స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రకారం అక్రమ ఇసుక వ్యాపారానికి ఈ చెక్ డ్యాం అడ్డంకిగా మారిందన్న కారణంతో పేల్చేశాని భావిస్తున్నారు రోజుకు 300-400 ట్రాక్టర్లు, ట్రక్‌లతో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న మాఫియా, నీటి నిల్వ కారణంగా ఇసుక తవ్వలేకపోవడంతో జిలెటిన్ స్టిక్‌లు, డిటోనేటర్‌లతో బ్లాస్టింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ఇది సహజ కారణాల వల్ల కాదు, ఉద్దేశపూర్వకంగా పేల్చినట్లు కనిపిస్తోంది. మూడు చోట్ల 90 మీటర్ల పొడవు పగుళ్లు, బ్రీచ్‌లు ఏర్పడ్డాయి అధికారులు ప్రకటించారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ దర్యాప్తు కొనసాగుతోందని చెబుతున్నారు. హైదరాబాద్ లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి టీమ్ నవంబర్ 24న స్థలాన్ని పరిశీలించింది. సహజ కారణాలా, ఉద్దేశపూర్వక బ్లాస్టింగ్ కావడమా అని నిర్ధారించడానికి సాంపిల్స్ సేకరించారు. కరీంనగర్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ కూడా స్థలాన్ని పరిశీలించి, రైతుల ఆందోళనలను విన్నారు. ఈ ఘటనపై రాజకీయ కలకలం రేగింది. బీఆర్ఎస్ మాజీ మంత్రి టి. హరీశ్ రావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ కె. సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు డి. మనోహర్ రెడ్డి, ఆర్. బాలకిషెన్, ఎస్. రవి శంకర్‌లు నవంబర్ 25న స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ ఇసుక మాఫియా పేల్చింది. మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజ్‌కు కూడా ఇదే కారణమా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిర్మాణ లోపమైతే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌ను బ్లాక్‌లిస్ట్ చేయాలని, టెండర్లు రద్దు చేయాలని కోరారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.చెక్ డ్యామ్ కూలిపోవడంపై పరిశీలనకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జమ్మికుంటలోని తనుగుల-గుంపుల చెక్ డ్యామ్‌లో విస్తృత నిర్మాణ లోపాలు, చెక్ డ్యామ్‌లు కూలిపోవడం పెద్ద సమస్య అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుంది.



## నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

- ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం
- ఎన్నికలు సజావుగా నిర్వహించాలని సూచన

**హైదరాబాద్, నవంబర్ 26 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాజకీయ రణక్షేత్రాలుగా గ్రామాలు!



**గ్రామాల్లో మళ్లీ సందడి మొదలయ్యింది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో గ్రామాలు ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా పల్లె పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలైంది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించగా, మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది.**

మూడు దశల్లో నిర్వహించే గ్రామ పంచాయతీల పేర్లను యంత్రాంగం ఖరారు చేసింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. కాగా, దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవి పార్టీ రహితమే అయినా, పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అయితే ఇప్పటికే ఓసారి సర్కారు చేసిన హడావుడిని నమ్మి ఆశావహులు, భారీగా ఖర్చు చేసి షెడ్యూల్ రద్దు కావడంతో నిరాశ చెందారు. ఇప్పుడు మరోసారి షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. కోర్టులో కేసు ఉందని తెలిసినా సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు, ఇప్పటికే తమ ప్రయత్నాల్లో మునిగి తేలారు. ఆ మేరకు భారీగా ఖర్చు చేశారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే ఐదు వేలకు పైగా జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ బరిలో ఉండే అభ్యర్థి 2.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 50వేలు.. అలాగే ఐదు వేల లోపు జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ అభ్యర్థి 1.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 30వేలలోపు ఖర్చు చేయాలి. అయితే ఆచరణలో జరిగే ఖర్చులకు ఎన్నికల సంఘం పెట్టిన నిబంధనలకు ఎప్పుడూ పొంతన ఉండదన్న విషయం తెలిసిందే. అయితే సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గుచూపుతారు. కానీ, గతంలోనే షెడ్యూల్ జారీచేయగా, అప్పుడు చాలా మంది అభ్యర్థులు భారీగా ఖర్చు పెట్టారు. తీరా ఆ షెడ్యూల్ రద్దుకావడంతో తీవ్ర నిరాశ చెందారు. ఇక ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది.

ఇదిలా ఉంటే పల్లెల్లో పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహలాడుతున్నాయి. పార్టీ రహిత ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. గతంలో ఓ మారు నోటిఫికేషన్ విడుదల, రద్దు కావడంతో అప్పటికే సిద్ధంగా ఉన్న అభ్యర్థులు మళ్లీ పోటీకి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తరవాత నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మూడు వారాల సమయంలోనే మొత్తం పక్రియ ముగియనుండంతో గ్రామాలు కేంద్రంగా రాజకీయ పార్టీలు బలాబలాలకు రంగం సిద్ధం అయ్యింది. 27తో తొలి దశ ఎన్నికల పక్రియ మొదలై డిసెంబర్ 17తో మూడో దశ పంచాయతీ ఎన్నికలు ముగుస్తాయి. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. అదికూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పోలింగ్ జరగ నుండడంతో గ్రామాల్లో ఓట్ల వేటలో అభ్యర్థులు పడ్డారు. డిసెంబర్ 11న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ, డిసెంబర్ 17న మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో నామినేషన్ల పర్వం కూడా వెంటనే మొదలయ్యింది. సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇక మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది.

ఎన్నికల సంఘం నుంచి ఎన్నికల ప్రకటన ఉంటుందని తెలిసి హడావిడిగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిందని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. మరోవైపు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు కూడా పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రుణాల పంపిణీ సంపూర్ణంగా అందివ్వలేదు. మొత్తానికి చీరల పంపిణీని ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో మహిళా లోకం నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది చూడాలి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటి నుంచి ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. తొలి విడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. రెండో విడతలో పోటీ చేసే వారికి షెడ్యూల్ జారీ నుంచి మొదలు పెడితే అదనంగా నాలుగైదు రోజులు కలిసి వస్తోంది. తుది విడతలో పోటీ చేసే వారికి దాదాపుగా మూడు వారాల సమయం దక్కుతోంది. ప్రచారానికి అధిక సమయం దక్కడం ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా తుది విడత అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా గ్రామాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.

# మరోసారి తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, నవంబర్ 26 :** గోల్డ్ లవర్స్ గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఎందుకంటే.. గత రెండు, మూడు రోజులుగా బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. పసిడి పరుగులు కాస్త తగ్గించినట్టుగా కనిపిస్తుంది. ఏడాది ఆరంభం నుండి ప్రజల్ని బెంబేలెత్తిస్తూ పరిగెత్తిన పసిడి ఇప్పుడు మెల్లిగా దిగివస్తున్నట్టుగా కనిపిస్తుంది. గత మూడు రోజులుగా బంగారం ధర తగ్గుతూ వచ్చింది. నవంబర్ 24 సోమవారం 24క్యారెట్ల బంగారం 10గ్రాములు రూ. 1,25,130 ఉండగా, అది స్వల్పంగా తగ్గింది. ఈ రోజుకు 1,25,120కి తగ్గింది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,660 పలుకుతోంది. అదే 22 క్యారెట్ల ధర రూ.1,15,190 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,70,900 లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14690 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,62,900 లుగా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,270, 22 క్యారెట్ల ధర రూ.1,14,840 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,62,900 లుగా ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,840, 22 క్యారెట్ల ధర రూ.1,15,350 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. కేరళలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,120, 22 క్యారెట్ల ధర రూ.1,14,690 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,70,900 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు. ఇకపోతే, ఇక్కడ పేర్కొన్న బంగారం ధరలు ఉదయం 8 గంటలలోపు అందిన సమాచారం మేరకు మాత్రమే. ధరలు ప్రతి క్షణం మారవచ్చు. అందువల్ల బంగారం కొనుగోలుదారులు ఇచ్చిన సమయంలో ప్రత్యక్ష ధరలను ట్రాక్ చేయాలి. ఇక్కడ పేర్కొన్న ధరలు నిన్నటి ముగింపు ధరలు అయితే, నేటి ధర తగ్గుదలతో లేదా పెరుగుదలతో ప్రారంభమవుతుంది.

## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు
# త్వరలో కార్యరూపం




**హైదరాబాద్, నవంబర్ 25 :** చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురా నుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది. తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు. దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది. భూసేకరణపై జాప్యాన్ని నివారించేందుకు త్వరగా స్థలాల ఖరారు చేయాలని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

# 20 నెలల క్రితమే ముగిసిన కాలపరిమితి

**హైదరాబాద్, నవంబర్ 26 :** 2024 ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. రాజ్యాంగంలోని 243(3) (ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం.. పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోగా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నది. పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘంగతేడాది డిసెంబర్ 14న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. కానీ, ఆచరణలో మాత్రం ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. బీసీ రిజర్వేషన్లు, తదితర అంశాలను సాకుగా చూపి.. పంచాయతీ ఎన్నికల నిర్వహణను ఆలస్యం చేస్తూ వచ్చింది. అయితే బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని భావించి, తాజాగా పంచాయతీ ఎన్నిలకు పచ్చజెండా ఊపడంతో దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి.

# వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

- పశ్చిమ-వాయువ్య దిశగా పయనం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన



**హైదరాబాద్, నవంబర్ 26 :** తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశలో కదిలి మరింతగా బలపడనుంది. మధ్య బంగాళాఖాతానికి చేరే క్రమంలో బలహీనపడనుంది. అటు బుధ, గురువారాల్లో వాయుగుండం దిశపై మరింత స్పష్టత లభించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే శ్రీలంక-నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో మరొక అల్పపీడనం ఏర్పడింది. బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. తర్వాతి 24 గంటల్లో ఇది కూడా వాయుగుండంగా బలపడే ఛాన్స్ ఉందన్నారు. రెండు వాయుగుండాలు ఉత్తర తమిళనాడు తీరం దిశగా కదలనున్నాయని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత కోస్తాంధ్ర వైపునకు చేరుకుని బలహీనపడనున్నాయి. నవంబర్ 30, డిసెంబర్ 1న తెలంగాణలో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో చలి తగ్గింది. మెదక్‌లో 13.8 డిగ్రీలు, పటాన్ చెరువులో 14.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 14.7 డిగ్రీలు, హయత్ నగర్‌లో 15 డిగ్రీలు, రాజేంద్ర నగర్‌లో 17 డిగ్రీలు, హనుమకొండలో 17.5 డిగ్రీలు, రామగుండంలో 17.5 డిగ్రీలు, నిజామాబాద్‌లో 17.6 డిగ్రీలు, దుండిగల్‌లో 17.7 డిగ్రీలు, నల్లగొండలో 18.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 18.2 డిగ్రీలు, హకింపేట్‌లో 18.7 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 19.1 డిగ్రీలు, ఖమ్మంలో 20.4 డిగ్రీలు, భద్రాచలంలో 20.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీపై కూడా వాయుగుండం ప్రభావం పడనుంది. రేపటి నుంచి మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లరాదని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లినవారు వెంటనే తిరిగి ఒడ్డుకి రావాలని సూచించింది. వాతావరణ ప్రభావంతో నవంబర్ 29 - డిసెంబర్ 2 వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలంది.

# అత్తింటి వేధింపులకు అల్లుడు బలి..!

**హైదరాబాద్, నవంబర్ 25 :** భార్య కాపురానికి రాకపోవడంతో పాటు అత్తింటి నుంచి వేధింపులు ఎదురవడంతో ఆత్మ హత్యాయత్నానికి ప్రయత్నించిన అల్లుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జగద్గిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ (32)కు జగిత్యాల జిల్లా మెట్పల్లికి చెందిన పూజతో సుమారు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు ఉంది. అయితే వివాహం అయినప్పటినుంచి వేరు కాపురం పెట్టాలని భార్య, అత్తమామలు హరి ప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చారు. కాగా ఈ విషయంలో దంపతులిద్దరి మధ్య గొడవలు కావడంతో, తరచూ కూతురును తీసుకొని పూజ తన పుట్టింటికి వెళ్లిపోయేది. ఈ క్రమంలోనే ఈ నెల 2న పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా .. అక్కడ అందరి ముందు తన కుమారుడిని దుర్భాషలాడి, విషం తాగి ఆత్మహత్య చేసుకోవాలని తన కుమారుడ్ని రెచ్చగొట్టారని హరిప్రసాద్ తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ అనంతరం పూజ కుమార్తెను తీసుకుని వెల్దుర్తిలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఈ క్ర మంలో హరిప్రసాద్ ఈ నెల 18న వెల్దుర్తిలోని అత్తారింటిముందు పురుగులమందు తాగాడు. చుట్టుపక్కల వారి సాయంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తన కుమారుడి మృతికి అతని భార్య పూజ, అత్తమామలు వరలక్ష్మి, కిష్టన్లతో పాటు బంధువులు రామాంజనేయులు, కిరణ్, శ్రీవాణిలు కారణమంటూ మృతుడి తండ్రి మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో
# ఎన్నికలు నిలిపివేత

**కరీంనగర్, నవంబర్ 26 :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాంచంద్రాపూర్‌కు అనుబంధంగా ఉన్న కుర్మపల్లి కొత్త పంచాయతీగా ఏర్పాటు కాగా, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని రాంచంద్రాపూర్ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల సంఘం ఈ రెండు గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేసింది. జిల్లాల వారీగా మూడు విడుతల్లో జరిగే మండలాలు కరీంనగర్ జిల్లాలో మొదటి విడుత గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఉన్నాయి. రెండో విడుతలో చిగురుమామిడి, తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం, మూడో విడుత వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుస్నాబాద్, సైదాపూర్(వీ) ఉన్నాయి. ఇక జగిత్యాల జిల్లాలో ÷రిదటి విడుత మేడిపల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఉన్నాయి. రెండో విడుతలో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, రాయికల్, బీర్పూర్, మల్యాల, కొడిమ్యాల ఉన్నాయి. మూడో విడుతలో ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, పెగడపల్లి ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడుత మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ ఉన్నాయి. రెండో విడుతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి, మూడో విడుతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ, కోనరావుపేట,చందుర్తి, రెండో విడతలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మూడో విడుత గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల సందడి మొదలయ్యింది. బుధవారం నామినేషన్లు మొదలు కావడంతో తొలిదశ గ్రామాల్లో హడావిడి కనిపించింది.

# ఔటర్ రింగ్ రోడ్డుపై కారు ప్రమాదం
## డ్రైవర్ సజీవదహనం!

**హైదరాబాద్, నవంబర్ 25 :** హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేట వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై కారు ప్రమాదం జరిగింది. రన్నింగ్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. కారు శామీర్‌పేట నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తుంగా ప్రమాదం జరిగింది. శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై కారు దగ్ధమైన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకొచ్చాయి. డ్రైవర్ హీటర్ ఆన్ చేసుకుని పడుకోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. హీటర్ ఎక్కువసేపు ఆన్‌లో ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని%ౌ% డ్రైవర్ నిద్రలేచి డోర్లు ఓపెన్ చేసేందుకు ప్రయత్నించినా అవి తెరుచుకోకపోవడంతో సజీవదహనం అయ్యాడని చెబుతున్నారు పోలీసులు. శామీర్‌పేట నుంచి కీసర వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. మంటల్లో సజీవ దహనమైన డ్రైవర్ హనుమకొండ ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు.

# కూసుమంచి ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్

## ప్రజా ప్రతినిధులుగా ఆకట్టుకున్న విద్యార్థులు







**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కూసుమంచి పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ ను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ప్రజాప్రతినిధుల ప్రమాణస్వీకారంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం స్పీకర్ ఎన్నిక జరిగింది. అధికార,ప్రతిపక్ష పాత్ర పోషించి సభ్యులు ప్రశ్నల వర్షం, అధికారపక్షం సమాధానాలతో సందడిగా సాగింది. ప్రతిపక్ష నాయకులు సంధించిన ప్రశ్నలకు అధికార పక్షం వారు దీటుగా సమాధానాలు ఇచ్చారు. సుదీర్ఘంగా చర్చలు జరిపారు. బిల్లులను ప్రతిపాదించి ఆమోదించారు. రాష్ట్రపతి ప్రసంగం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి మాట్లాడుతూ.. మాక్ పార్లమెంట్ ఆసాంతం అసలైన పార్లమెంట్ తలపించిందన్నారు. మాక్ పార్లమెంట్ ద్వారా భారత రాజ్యాంగ విలువలు,పార్లమెంట్ సమావేశాలపై అవగాహన కలుగుతుందన్నారు. పార్లమెంట్ లో జరిగే చర్చలు స్పీకర్,ఎంపీలు,కేంద్ర మంత్రులు శాఖలు,వారు నిర్వహించే పనులు,వివిధ అంశాలను గురించి కూలంకషంగా తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా అదరగొట్టారని,సభాపర్వాన్ని నిర్వహించి ఔరా అనిపించారని కితాబిచ్చారు. ప్రధానమంత్రిగా, రాష్ట్రపతి, స్పీకర్, ప్రతిపక్ష నేతలుగా చిన్నారులు పోషించిన పాత్రలు ఆకట్టుకున్నాయని, అసలైన పార్లమెంట్ ను తలపించేలా వాడీవేడిగా చర్చలు జరిపారన్నారు. ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. విద్యార్థులను మాక్ పార్లమెంట్ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ చూపిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు నూర్జహన్, శ్రీలక్ష్మి, నరేశ్, హరీశ్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# పాకిస్తాన్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ హత్య..!!

- ఆఫ్ఘన్ మీడియా సంచలన ప్రకటన
- ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్

**న్యూఢిల్లీ, నవంబర్ 26 :** పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో 'రహస్యంగా' చంపేశారని ఆఫ్ఘన్ మీడియా ప్రకటించింది. అయితే, పాకిస్తాన్ ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారని చెబుతోంది. ఆఫ్ఘన్ మీడియా చేసిన ప్రచారంతో రావల్పిండిలోని అడియాలా జైలు వద్ద వేలాది మంది పీటీఐ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఆఫ్ఘన్ న్యూస్ వెబ్‌సైట్ 'అఫ్ఘానిస్తాన్ టైమ్స్' మంగళవారం రాత్రి సంచలన ప్రకటన చేసింది. "పాకిస్తాన్‌లోని విశ్వసనీయ మూలాలు తెలిపిన సమాచారం ప్రకారం, పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో రహస్యంగా చంపేశారు. అతని శవాన్ని జైలు నుంచి బయటకు తరలించారు" అని ఆ వార్తలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు 'కాబుల్ ఫ్రంట్‌లైన్' వంటి ఇతర ఆఫ్ఘన్ మీడియా ఔట్‌లెట్లలో కూడా విస్తృతంగా ప్రచారం అయ్యాయి. 'పాకిస్తాన్ సైన్యంలోని రహస్య వ్యక్తులు' ఇచ్చిన సమాచారం అని చెప్పుకున్నారు. కానీ ఎలాంటి ఆధారాలు లేవు. పాకిస్తాన్ అధికారులు ఈ ఆరోపణలను 'తప్పుడు వార్త'గా ఖండించారు. "ఇమ్రాన్ ఖాన్ క్షేమంగా ఉన్నాడని.. అతనికి ఎలాంటి హాని జరగలేదు. ఈ రూమర్‌లు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడానికి ఉద్దేశించినవి" అని పాకిస్తాన్ సమాచార మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించారు. అడియాలా జైలు సూపరింటెండెంట్ కూడా ఖాన్ ఆరోగ్యం బాగుందన్నారు. అతను తన ట్విట్టర్ ఖాతాను కూడా జైలు నుంచి నిర్వహిస్తున్నాడనే ఆరోపణలు తప్పు అని ఇస్లామాబాద్ కోర్టులో సోమవారం స్పష్టం చేశారు. పాకిస్తాన్ మొబైల్ ఆపరేటర్లు కూడా ఈ రూమర్‌లు 'ఫేక్ న్యూస్'గా గుర్తించి, వాటిని అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ రూమర్ వల్ల పీటీఐ కార్యకర్తలు మండిపడ్డారు. మంగళవారం అడియాలా జైలు వద్ద వేలాది మంది సమావేశమై, ఖాన్ ఆరోగ్యం గురించి సమాచారం కోరుతూ నిరసనలు చేశారు. ఖాన్ సోదరి అలీమా ఖాన్, డాక్టర్ ఉజ్మా, నూరీన్ నియాజీలు జైలు గేటు వద్ద కూర్చుని ధర్నా చేశారు. అయితే, పోలీసులు వారిని బయటకు తీసుకెళ్లారు. 3 రోజులుగా మిమ్మల్ని ఇమ్రాన్ ఖాన్‌తో కలవనీయకుండా ఆపేశారు. అతనికి ఏమైందో తెలుసుకోవాలి అని అలీమా ఖాన్ మీడియా ముందు డిమాండ్ చేశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్నారు. అవినీతి, రాష్ట్ర ద్రోహం వంటి 20కి పైగా కేసుల్లో అతనిక శిక్ష విధించారు. గత నెలలో అతను సైనిక అధిపతి అసీమ్ మునీర్‌పై తీవ్రంగా విమర్శించాడు. డెమోక్రసీని చీల్చి, 'అసీమ్ లా'ను రుద్దుతున్నారు" అని ఖాన్ పేరిట జైలు నుంచి ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ రూమర్‌ను నమ్మేవాళ్లు ఎక్కువగా ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను బయటకు చూపించాలని డిమాండ్ చేసేవారు పెరుగుతున్నారు.




## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ

### టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుంది అని టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో అధ్వానంగా ఉన్న రోడ్ల దుస్థితిని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా నుండి కుడకుడ రోడ్డు వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అస్తవ్యస్తంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు .గత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు ప్రజల గురించి పట్టించుకోలేదని రెండుసార్లు మంత్రి గా ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న జగదీశ్వర్ రెడ్డి ఎప్పుడు కూడా రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న సూర్యాపేట రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడిలాగే అద్వానంగా తయారైందని తెలిపారు. ప్రభుత్వాలు మారినా ప్రజల్ని పట్టించుకునే ప్రభుత్వం ఇంతవరకు రాలేదని తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నేను పాదయాత్ర చేసుకుంటూ వస్తున్న సందర్భంలో పలు వ్యాపారులు నాకు సూర్యాపేటలో రోడ్ల సమస్యల పై సంఘీభావం తెలిపారని అన్నారు. ఈ దుమ్ము దూళి వలన శ్వాస కోస వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారని,అండర్ డ్రైనేజీ పనుల కోసం రోడ్డు మధ్యలో గుంతలు తీసిన కాంట్రాక్టర్లు మట్టి పోయకుండా వదిలి వేయడం వల్ల ప్రజలు అందులో పడి కాళ్లు, చేతులు విరిగి ఇంటికే పరిమితమైన సందర్భాలు ఉన్నాయని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలని అన్నారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్,చాంద్ పాషా,మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, కుంభం నాగరాజు,ఉప్పల మల్లయ్య, బొల్లె సైదులు,ఆవుల అంజయ్య,మధు,పల్స నగేష్, రమేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### సీనియర్ సివిల్ జడ్జ్ పరిహిన్ కౌసర్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ సంయుక్తంగా భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ పరిహిన్ కౌసర్ పాల్గొని భారత రాజ్యాంగంలో రాజ్యాంగ హక్కులు విధులను ప్రతి విద్యార్థి విద్యార్థినులు తెలుసుకోవాలని రాజ్యాంగపరంగా ముందుకు నడవాలని కోరారు నేటి బాలలే రేపటి పౌరులని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు విద్యార్థులు చేరుకోవాలని దేశ సమైక్యత సమబావన కోసం కృషి చేయాలని అన్నారు ప్రజలందరి కోసం సమ న్యాయం కోసం ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవ సంస్థ వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబు ల్ సొసైటీ వారు బహుకరించిన భారత రాజ్యాంగం సంక్షిప్త పుస్తకం విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మరియు న్యాయవాదులు కళాశాల అధ్యాపకులు రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించా రు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి లింగయ్య యాద వ్, అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ కుమార్, సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది తల్లమల్ల హసేన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గుంటూరు మధు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకర బోయిన రాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు పెరుమాళ్ళ యాదయ్య, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు బి ప్రవీణ్ కుమార్ సీనియర్ న్యాయవాదులు వసంత సత్యనారాయణ, పిల్లే యాదవ్, న్యాయవాదుల సహకార సొసైటీ ప్రధాన కార్యదర్శి కోక రంజిత్ కుమార్,మహిళా న్యాయవాది జ్యోతి, యువ న్యాయవాది సుంకర రవి, సంఘమిత్ర ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ సభ్యులు గాజుల నరసయ్య బొయిల అఖిల్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టణ కేంద్రంలో పలు చోట్ల శానిటేషన్ ను పరిశీలించిన

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రహదారి, వైష్ణవి ఆసుపత్రి సమీపంలోని శానిటేషన్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత పాటించి చెత్త ఉండకుండా వెంటనే శుభ్రత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంటింటి చెత్తను ప్రతీ రోజూ సేకరించాలని, ఎక్కడైనా చెత్త పేరుకు పోకుండా రోజువారీ పర్యవేక్షణ చేయాలని, ఆసుపత్రులు, రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టాలని, చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేయకుండా పౌరుల ఆరోగ్యం, శుభ్రమైన పర్యావరణం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలంటూ, స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధన కోసం మున్సిపాలిటీ పూర్తి నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ పలు సూచనలు చేశారు.

# ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బురఖా వివాదం

### నిబంధనలపై మహిళా సెనేటర్ వినూత్న నిరసన



**న్యూఢిల్లీ, నవంబర్ 26 :** ఆస్ట్రేలియా పార్లమెంట్ లో బురఖాపై వివాదం నెలకొంది. దేశంలో బురఖాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళా సెనేటర్ బురఖా ధరించి పార్లమెంట్ కు హాజరుకావడంపై తోటి సభ్యులు అభ్యంతరం తెలిపారు. బురఖాను నిషేధించాలన్న ఆమె ప్రతిపాదనను తిరస్కరించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్.. సదరు సెనేటర్ ను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు. ఆస్ట్రేలియాలో బురఖాను, ముఖాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సెనేటర్ పౌలిన్ హాన్ సన్ (71) పార్లమెంట్ లో ఓ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ బిల్లుపై చర్చకు కూడా తోటి సెనేటర్లు అంగీకరించకపోవడంపై మండిపడ్డ హాన్ సన్.. దీనికి నిరసనగా తల నుంచి పాదం వరకు కప్పి ఉంచే బురఖా ధరించి పార్లమెంట్ కు వచ్చారు. అయితే, బురఖాలో సమావేశాలకు హాజరుకావడం పార్లమెంట్ తో పాటు తోటి సెనేటర్లను అవమానించడమేనని, హాన్ సన్ తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని మిగతా సెనేటర్లు విమర్శించారు. హాన్ సన్ తీరుపై స్పీకర్ కూడా మండిపడ్డారు. వెంటనే సభకు క్షమాపణ చెప్పాలని ఆదేశించారు. దీనికి హాన్ సన్ ససేమిరా అనడంతో స్పీకర్ ఆమెను ఫిబ్రవరి వరకూ సస్పెండ్ చేశారు.



## అందరి హక్కులకు రక్షణ

# భారత రాజ్యాంగం

### మాల మహానాడు జెఏసి కన్వినర్ వీర్జాల వేణు బలరాం

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** దేశంలో ఉన్న ప్రతీ ఒక్క పౌరుడు రాజ్యాంగ పునాదులను గుర్తు చేసుకోవాలని వారికి కల్పించిన హక్కుల గురించి ఆలోచించాలని తమ యొక్క బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని మాల మహానాడు జెఏసి కన్వినర్ వీర్జాల వేణు బలరాం కోరారు. బుదవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ దగ్గర అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు జెఏసి మరియు సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న పౌరులందరికి రాజ్యాంగ ఫలాలు అందినప్పుడే ప్రజలందరికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని పేర్కొన్నారు. రాజ్యాంగం యొక్క గొప్పదనాన్ని విధార్ది దశనుండే అవగాహన కల్పించాలంటే ప్రతీ పాఠశాలలో విధిగా ప్రతీ రోజు రాజ్యాంగ పీఠికను విద్యార్థులచే చదివిపించాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షులు ఎర్రమళ్ళ రాములు, సమతా సైనిక్ దళ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి నరేష్ మౌర్య, మాల మహానాడు కో కన్వీనర్లు కట్ట సైదులు,కట్ల మురళి,అశ్వధ రవి, మరియు కల్యూరి రంజిత్, గోపినాధ్,ప్రవీణ్, కర్నాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న జేఈఈ మెయిన్ తొలి విడత రిజిస్ట్రేషన్లు

**న్యూఢిల్లీ, నవంబర్ 26 :** దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ (మెయిన్-2026 తొలి విడత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నేటితో ముగియనున్నాయి. నవంబర్ 27 రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదేరోజు రాత్రి 11:50 గంటల్లోగా ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులకు అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే డిసెంబర్ 1 నుంచి 2వ తేదీ రాత్రి 11.50 వరకు సవరించుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. జేఈఈ మెయిన్ సెషన్ 1 దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదుచేసిన వివరాల సవరణకు గడువు ముగిసిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వరు. ఒక్కసారి మాత్రమే వివరాలు సవరించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తులో అభ్యర్థి మొబైల్ నంబర్, ఈ-మెయిల్, అడ్రస్, ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలు, అభ్యర్థి ఫొటోను మార్చడానికి అవకాశం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అభ్యర్థి పేరు, తండ్రి పేరు,తల్లి పేర్లలో ఏదో ఒకటి మాత్రమే సవరించేందుకు అవకాశం ఇస్తారు. పదో తరగతి, 12వ తరగతి సంబంధిత వివరాలు, పాన్ కార్డు నంబర్, పరీక్ష రాయాలనుకొనే నగరం, మాధ్యమాన్ని మార్చుకొనేందుకు ఛాన్స్ ఉంటుంది. అలాగే అభ్యర్థి పుట్టిన తేదీ, జెండర్, కేటగిరీ, సబ్ కేటగిరీ, సంతకం మార్చుకోవచ్చు. ఆధార్ కాకుండా ఇతర గుర్తింపుతో నమోదు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే తమ గుర్తింపు వివరాలను మార్చడానికి అనుమతి ఉంటుంది. ఆధార్ వివరాలు సవరించుకోవడానికి మాత్రం అవకాశం ఉండదు. ఈ విషయాలను అభ్యర్థులు దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా సవరించుకోవల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్ మొదటి విడుత పరీక్ష రోజుకు రెండు సెషన్లలో జనవరి 21 నుంచి 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆయా తేదీల్లో ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

# ఆటో కింద పడి 18 నెలల చిన్నారి మృతి


**బోధన్ :** ఏడాదిన్నర చిన్నారి ఆటో కింద పడి మృతి చెందిన ఘటన సాలూర మండలం సాలంపాడ్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఇంటి ముందుకు ఆటోలో ఉల్లిగడ్డలు అమ్ముకుంటూ వచ్చిన బోధన్‌కు చెందిన వ్యాపారి అబ్దుల్ ఖాదర్ వద్దకు తల్లి అయేషాబేగం వెళ్లింది. ఆమెను వెనుకే చిన్నారి (18 నెలలు) కూడా పాకుతూ ఇంటి బయటకు వచ్చింది. ఉల్లి గడ్డల బేరం కుదరక తల్లి పక్కకు రాగా.. ఖాదర్ ఆటో ముందుకు పోనిచ్చాడు. పాపను గమనించకపోవడంతో ఆటో టైరు.. పాప తలపై నుంచి వెళ్లింది. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అప్పటి వరకు కళ్లముందే ఆడిన పసి పాప విగతజీవిగా మారడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై తెలిపారు. సాలంపాడ్ గ్రామానికి చెందిన ఇర్ఫాన్, అయేషాబేగం దంపతుల ఈ చిన్నారి మూడో సంతానం.

# టైల్స్ పరిశ్రమలో గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి మండలంలోని ఎల్లంపాడు సమీపంలో ఉన్న ఓ టైల్స్ పరిశ్రమలో గ్యాస్ సిలిండర్ పేలడంతో పోతురాజు (30), పాండు(30) అక్కడికక్కడే మృతి చెందారు. మరి కొందరు కూలీలు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం వెంకటగిరి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## అఫ్గాన్‌తో ఉద్రిక్తతలు తగ్గేలా లేవు

### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్:** అఫ్గానిస్థాన్–పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం.. తదితర అంశాలపై ఇటీవల జరిగిన శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని.. అవి తగ్గే అవకాశాలు కనిపించట్లేదన్నారు. అఫ్గాన్ తో సంబంధాల పునరుద్ధరణకు 2021 తర్వాత నుంచి చేసిన యత్నాలు విఫలమై నట్లు వెల్లడించారు. ఇకపై తాలిబన్ల మీద ఏమాత్రం ఆశలు లేవని జియోన్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పాకిస్థాన్ తమపై బాంబు దాడులు చేసిందని బుధవారం తెల్లవారుజామున అఫ్గాన్ తాలిబన్ పరిపాలన ప్రతినిధి జబీవుల్లా చేసిన ప్రకటనను ఖవాజా ఆసిఫ్ కొట్టిపడేశారు.

## తొమ్మిది నెలల్లో రెట్టింపైన వివేక్ రామస్వామి సంపద..



**యూఎస్ :** భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి సంపద తొమ్మిది నెలల్లోనే రెట్టింపైంది. 80 శాతం పెరుగుదలతో ఆయన నికర సంపద 1.8 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ మేరకు ఫోర్బ్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఫోర్బ్స్ మార్చి నివేదికలో రామస్వామి నికర సంపద 1 బిలియన్ డాలర్‌గా ఉన్నట్లు అంచనా వేసింది. దీంతో ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ఆయనకు చోటు దక్కలేదు. తాజాగా కేవలం తొమ్మిది నెలల్లోనే ఆయన సంపద 1.8 బిలియన్ డాలర్లకు చేరింది. ఒహాయో గవర్నర్‌గా పోటీ చేసేందుకు రామస్వామి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన సంపద పెరగడం గమనార్హం. 39 ఏళ్ల వివేక్.. తొలుత ప్రధాన ఫార్మాస్యూటికల్ కంపెనీ అయిన.. హెడ్జ్ ఫండ్‌లో పని చేశారు. 2014లో రోయివెంట్ సైన్సెస్ అనే కంపెనీని స్థాపించారు. ఒక్క ఏడాదిలోనే ఆ కంపెనీ సంపద 3 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇక, 2023లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. ఆ తర్వాత పోటీ నుంచి తప్పుకున్న ఆయన.. ట్రంప్‌నకు మద్దతుగా ప్రచారం చేశారు. ట్రంప్ అధికారం చేపట్టాక.. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన డోజ్ శాఖలో కీలక పదవిని అప్పగించారు. ఆ తర్వాత డోజ్ నుంచి కూడా వివేక్ బయటకు వచ్చేశారు. ఒహాయో గవర్నర్‌గా పోటీకి దిగనున్నట్లు ప్రకటించారు. రామస్వామికి ట్రంప్ మద్దతు తెలిపారు. ఆయన సమ్‌థింగ్ స్పెషల్ అంటూ ప్రశంసలు కురిపించారు. వచ్చే ఏడాది నవంబరులో ఒహాయో గవర్నర్ ఎన్నికలు జరగనున్నాయి.



## ఆకాశహర్మ్యాల్లో భారీ అగ్నిప్రమాదం

**హాంకాంగ్ :** హాంకాంగ్‌లోని ఓ నివాస సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. థాయ్ పొ జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. దాంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో 2000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ దుర్ఘటనలో నలుగురు మృతి చెందారని, వందలాది మంది చిక్కుకుపోయారని పేర్కొన్నాయి. హాంకాంగ్ స్థానిక కాలమానం ప్రకారం.. మధ్యాహ్నం 2.51 గంటల సమయంలో ఈ ఘటనపై సమాచారం అందిందని అగ్నిమాపక విభాగం వెల్లడించింది. ఈ ప్రమాదాన్ని నం.4 అలారంగా అధికారులు ప్రకటించారు. ఈ అత్యయిక పరిస్థితి ప్రకటించినప్పుడు భారీ స్థాయిలో ఫైర్ ఇంజిన్లు, సిబ్బందిని మోహరించాల్సి ఉంటుంది.

# విదేశీ విద్యార్థులకు అమెరికా భారీ ఊరట



**యూఎస్ :** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు అగ్రరాజ్యం భారీ ఊరట కల్పించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఎఫ్–1 విద్యార్థి వీసాల్లో కీలక మార్పులు తీసుకురానుంది. ఈ వీసాల జారీలో ప్రస్తుతం అనుసరిస్తున్న 'ఇంటెంట్ టు లీవ్' నిబంధన రద్దు దిశగా డిగ్నిటీ యాక్ట్–2025ను చట్టసభ్యులు ప్రతిపాదించారు. అంటే, ఇకపై విదేశీ విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత తప్పనిసరిగా స్వదేశానికి తిరిగెళ్తామని నిరూపించుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం ఎఫ్–1 వీసా దరఖాస్తుల్లో చాలావరకు 'ఇంటెంట్ టు లీవ్' రూల్ కిందే తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నిబంధన ప్రకారం దరఖాస్తుదారులు తాత్కాలిక స్టే తర్వాత (చదువు పూర్తయిన వెంటనే) అమెరికా విడిచివెళ్లిపోతామని కాన్సులర్ అధికారి వద్ద నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం దరఖాస్తుదా రులు తమ స్వదేశంలో ఉన్న తమ ఆస్తులు లేదా ఉద్యోగావ కాశాలకు సంబంధించిన పత్రాలను చూపించాల్సి ఉంటుంది. విదేశీ విద్యార్థులకు ముఖ్యంగా భారతీయులకు ఈ నిబంధన కఠినంగా మారింది. ఈ ఏడాది భారత విద్యార్థులకు ఎఫ్–1 వీసాల జారీ సంఖ్య భారీగా తగ్గింది. ఈ వీసాల తిరస్కర ణల్లో అత్యధికం 'ఇంటెంట్ టు లీవ్'ను నిరూపించుకోలేని అభ్యర్థులవే ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే తాజా చట్టం ఇలాంటి విద్యార్థులకు ఊరట కల్పించే అవకాశం ఉంది. 'తిరిగెళ్లే ఉద్దేశం ఉందా?' అనే ప్రశ్న లేకుండా వీసాలు జారీ చేస్తే.. అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అయితే, ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు బిల్లు దశలోనే ఉన్నాయి. అమెరి కా కాంగ్రెస్ ఉభయసభల్లో ఇది ఆమోదం పొంది అధ్యక్షుడు సంతకం చేసిన తర్వాత ఈ డిగ్నిటీ చట్టం అమల్లోకి రానుంది. మరోవైపు, ఎఫ్–1 వీసాల్లో 'డ్యూరేషన్ ఆఫ్ స్టే'ను తొలగించే దిశగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ మార్పులు చేపట్టింది. ఎంతకాలం అంటే అంతకాలం చదవాలనుకునే వీలు లేకుండా.. 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన విద్యార్థి వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది.

## ఢిల్లీ కాలుష్యంతో నేనూ ఇబ్బందిపడ్డా

### సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుడంతో.. అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గంటపాటు వాకింగ్‌కు వెళ్లడంతో తనకు శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విచారణలను వర్చువల్ మోడ్‌కు మార్చడానికి బార్ అసోసియేషన్ అంగీకరిస్తే.. కోర్టు ఏకరీతి నియమాన్ని రూపొందించడానికి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. గత రెండు వారాలుగా వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ)లు దారుణంగా పడిపోతుండడం.. తీవ్ర కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తుండడంతో 60 ఏళ్లు పైబడిన న్యాయవాదులు వ్యక్తిగతంగా కోర్టుకు రావడానికి బదులుగా వర్చువల్ విధానంలో విచారణకు హాజరు కావడానికి అనుమతించాలని సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది విజ్ఞప్తి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సైతం రాకేష్ ద్వివేది వ్యాఖ్యలతో ఏకీభవించారు. 60 ఏళ్ల వయసులో తాము వాయు కాలుష్యంతో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. తాను కూడా ఇబ్బంది పడుతున్నానన్నారు. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో ధర్మాసనం రెండు వారాల క్రితమే ఢిల్లీ కాలుష్యంపై న్యాయవాదులను హెచ్చరించింది. పరిస్థితులు తీవ్రంగా ఉన్నప్పుడు న్యాయవాదులు స్వయంగా కోర్టుకు హాజరు కానవసరం లేదని.. వర్చువల్ హియరింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని లాయర్లకు సూచించింది. ఈ విషయంపై ప్రధాన న్యాయమూర్తితో చర్చిస్తామని తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ తీవ్రంగా పడిపోతుండడంతో పర్యావరణ శాఖ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులకు హాజరయ్యే సిబ్బందిలో 50శాతం మంది ఇంటి నుంచే పనిచేయాలని, మిగిలిన సగం మంది మాత్రమే కార్యాలయాలకు రావాలని ఆదేశించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం–1986లోని సెక్షన్ 5 నిబంధన ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపింది. నగరంలో వాహనాల రాకపోకలను తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 50శాతం మందికి 'వర్క్ ఫ్రం హోం' నిబంధనను అన్ని సంస్థలూ పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

## ఢిల్లీ కేసులో మరో వ్యక్తి అరెస్టు



**న్యూఢిల్లీ :** ఢిల్లీ పేలుడు ఘటనలో ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబీకి ఆశ్రయమిచ్చిన ఫరీదాబాద్‌కు చెందిన షోయబ్ అనే వ్యక్తిని జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు తాజాగా అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య ఏడుకు చేరింది. అతడు ఉమర్‌కు పది రోజులపాటు ఆశ్రయమివ్వడమే కాకుండా ఎర్రకోట వద్ద ఉగ్ర దాడికి ముందు పేలుడు పదార్థాలను కూడా సరఫరా చేసినట్లు తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుల్లో ఒకడైన డా.ముజమ్మిల్ షకీల్ ఇచ్చిన సమాచారంతో షోయబ్‌ను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. షోయబ్ అల్–ఫలా విశ్వవిద్యాలయంలో కాంపౌండర్‌గా పని చేశాడని.. ఉగ్ర కుట్ర గురించి అతడికి ముందే తెలుసని అధికారులు పేర్కొన్నారు. ఐఈడీ బాంబుల తయారీకి వాడే పేలుడు పదార్థాలను నిందితులు అతడి ఇంటిలోనే నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. పేలుడు పదార్థాల తయారీకి అనుమానితులు ఉపయోగించిన గ్రైండర్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉమర్‌తో సంబంధమున్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి దర్యాప్తు చేపట్టామన్నారు. సూసైడ్ బాంబర్ ఉమర్ నబీ వద్ద పెద్ద సూట్‌కేస్ ఉండేదని అనుమానితుల్లో ఒకడైన డా.ముజమ్మిల్ షకీల్ జాతీయ దర్యాప్తు సంస్థ విచారణలో పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ రహస్య సూట్‌కేస్‌ను ఎక్కడికి వెళ్లినా తనవెంట తీసుకెళ్లేవాడని.. అందులో ఉన్న బాంబు తయారీ పదార్థాలు, వస్తువులతో అల్–ఫలా క్యాంపస్‌లోని తన గదిలోనే పేలుడు పదార్థాలపై పరీక్షలు చేసేవాడని ముజమ్మిల్ తెలిపాడు. అనంతరం పెద్ద మొత్తంలో ఐఈడీని తయారుచేసి, హరియాణాలోని వివిధ ప్రదేశాల్లో దాచిపెట్టేవాడని చెప్పాడు. ముందు వీటన్నిటినీ కశ్మీర్‌కు తీసుకువెళ్లాలని వారు అనుకున్నారని.. అక్కడ ఏదో పెద్ద దాడికి ఉమర్ ప్రణాళిక వేసుకున్నాడని పేర్కొన్నాడు. అది ఫలించకపో వడంతో హరియాణాలోనే దాచినట్లు తెలిపాడు. అతడు ఇచ్చిన సమాచారంతో ఉమర్ సూట్‌కేసును స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులో పేలుడు పదార్థాల తయారీలో వాడే రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు.

## రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వీటి కొరతను అధిగమించేందుకు కొత్త పథకం తీసుకొచ్చింది. 'సింథర్డ్ రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్'ను తయారీని ప్రోత్సహించేందుకు రూ.7280 కోట్లు వెచ్చిచేందుకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఏడాదికి 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ కీలకం. ప్రస్తుతం అవసరాలు 2030 నాటికి రెట్టింపు కానున్నాయనేది అంచనా. ప్రస్తుతం వీటి కోసం దిగుమతులపై ఆధారపడు తున్నాం. దీన్ని అధిగమించేందుకు క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గ్లోబల్ పోటీ బిడ్డింగ్ ద్వారా ఐదుగురు లబ్ధిదారులకు కేటాయించనున్నారు. ప్రతి లబ్ధిదారుడికి గరిష్ఠంగా సంవత్సరానికి 1200 మెట్రిక్ టన్నుల సామ ర్థ్యాన్ని నిర్దేశిస్తారు. ఈ పథకం ఏడు సంవత్సరాలు ఉంటుంది. మొదటి రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి గెస్టేషన్ పీరియడ్ ఉంటుంది. తర్వాత 5 ఏళ్లు వీటి అమ్మకాలపై ప్రోత్సాహకాలు చెల్లిస్తారు.



## చట్టాన్ని తప్పించుకొని పారిపోయేవారిని వెనక్కి రప్పించే హక్కు కేంద్రానికి ఉంది

### సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** చట్టాన్ని తప్పించుకొని విదేశాలకు పారిపోయే నేరగాళ్లను వెనక్కి తెచ్చే హక్కు కేంద్రానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. తన అప్పగింతను సవాల్ చేస్తూ విజయ్ మురళీధర్ అనే పిటిషనర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద గుజరాత్‌కు చెందిన విజయ్ మురళీధర్ ఉద్వానీపై 153 కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. అతడు 2022లో దుబాయ్‌కు పారిపోయాడు. తనపై జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసును వెనక్కి తీసుకోవాలని, తన అప్పగింత కోసం యూఏఈ ప్రభుత్వానికి చేసిన అభ్యర్థనను ఉపసంహరించుకోవాలని విజయ్ వేసిన పిటిషన్‌ను గతంలో గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అతడు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. "మీపై ఎన్నో కేసులు నమోదై ఉన్నాయి. స్వదేశానికి తిరిగిరండి. చట్టాన్ని తప్పించుకొని పారిపోయేవారిని వెనక్కి రప్పించే హక్కు కేంద్రానికి ఉంటుంది" అని విచారణలో భాగంగా సుప్రీం వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విజయ్‌పై 38 నేరాలు నమోదై ఉన్నాయని, వాటి వివరాలు ఏవీ అతడికి తెలియవని కోర్టుకు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ఆక్షేపించింది. ఆ వివరాలు కావాలంటే సంబంధిత ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. అదేమీ రాకెట్ సైన్స్ కాదని, అతడికి వ్యతిరేకంగా అరెస్టు వారెంట్ ఉందని గుర్తుచేసింది. "దుబాయ్ లో ఉన్న మీకు ఈ వివరాలన్నీ ఒక పళ్లెంలో పెట్టి అందించాలని అనుకుంటున్నారా..?ఇక్కడికి రండి.. పూర్తి వివరాలు అందుతాయి" అని మందలించింది. విజయ్ వద్ద అతడి పాస్‌పోర్టు లేదని, సహనిందితుడు ఒకరు కస్టడీలో చనిపోయాడని న్యాయవాది కోర్టుకు వెల్లడించగా.. "అతడిని అధికారులు తీసుకువస్తారులే" అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఆ నిందితుడిది సహజ మరణం అని పోలీసులు న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ వాదనల తర్వాత పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో.. విజయ్ తరఫు లాయర్ దానిని ఉపసంహరించుకున్నారు.




## కేఫ్‌పై కాల్పులు జరిగిన ప్రతిసారి.. మరింత మంది జనాలు : కపిల్ శర్మ

**న్యూఢిల్లీ :** బాలీవుడ్ కమెడియన్, హోస్ట్ కపిల్ శర్మకు చెందిన కెనడాలోని కేఫ్‌పై గత కొన్ని నెలల్లో పలుమార్లు కాల్పులు జరగడం కలకలం రేపాయి. అయితే, ప్రతి ఘటన అనంతరం తన కేఫ్‌కు మరింత మంది జనాలు వచ్చారని ఆయన తెలిపారు. ఈ కాల్పులతో కెనడా అధికారులు కూడా ఇటువంటి దాడులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ముంబయి లాంటి నగరం మరొకటి లేదని.. భారత్‌లో తనకు ఎక్కడా అభద్రతా భావం కలగలేదని చెప్పారు. "స్థానిక నియమాల కారణంగా అక్కడి పోలీసులకు ఇటువంటి ఘటనలను నియంత్రించే అధికారం లేకపోవచ్చు. కానీ.. నా కేఫ్‌పై కాల్పుల వ్యవహారం కెనడా ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. పార్లమెంటులోనూ దీనిపై చర్చ జరిగింది. నిజానికి.. ప్రతి కాల్పుల ఘటన అనంతరం కేఫ్‌కు మరింత ఆదరణ లభించింది. దేవుడు నాతో ఉంటే అంతా బాగానే ఉంటుంది. అక్కడి పరిస్థితులపై చాలా మంది ఫోన్లు చేశారు. నా కేఫ్‌పై కాల్పుల ఘటన వార్తగా మారింది. ఇప్పుడు అక్కడ శాంతిభద్రతలను మెరుగుపర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు" అని ఓ కార్యక్రమంలో కపిల్ శర్మ చెప్పారు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో కపిల్ శర్మ 'కాప్స్ కేఫ్'ను ప్రారంభించారు. ఈ ఏడాది జులైలో తొలిసారి గుర్తుతెలియని వ్యక్తులు దానిపై కాల్పులు జరిపారు. ఆగస్టు, అక్టోబరు నెలల్లోనూ ఈ తరహా ఘటనలు నమోదయ్యాయి. అయితే, ఈ దాడుల్లో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ కాల్పులకు తామే బాధ్యులమని ఎవరూ ప్రకటించలేదు. 'ది కపిల్ శర్మ షో' తదితర కార్యక్రమాలతో పేరుపొందిన కపిల్.. 'ఏబీసీడీ 2', 'కిస్ కిస్కో ప్యార్ కరూ', 'క్రూ' తదితర సినిమాల్లో వినోదం పంచారు. ప్రస్తుతం 'కిస్ కిస్కో ప్యార్ కరూ 2'లో నటిస్తున్నారు.

# బైకు చెయిన్ తెగినా సురక్షితంగా ఇంటికి..

### ర్యాపిడో రైడ్‌పై బెంగళూరు యువతి పోస్టు



**బెంగళూరు :** ర్యాపిడో కెప్టెన్ల వ్యవహారశైలి గురించి విమర్శలు చేస్తూ.. ప్రయాణికులు సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను ఎక్కువగా చూస్తుంటాం. వారిని అభినందిస్తూ వచ్చే పోస్టులు చాలా అరుదు. అలా ఓ మహిళ అర్ధరాత్రి తనను ఇంటిదగ్గర సురక్షితంగా చేర్చినందుకు ర్యాపిడో కెప్టెన్‌ను అభినందిస్తూ.. ఓ పోస్టు పెట్టింది. నెట్టింట వైరల్ అవుతున్న ఈ పోస్టుపై ర్యాపిడో సంస్థ కూడా స్పందించింది. బెంగళూరుకు చెందిన ఆషా మనే తన ర్యాపిడో రైడ్ గురించి పంచుకుంది. 'మా ఇంటికి వెళ్లేందుకు అర్ధరాత్రి 11:45 గంటలకు ర్యాపిడో బుక్ చేసుకున్నా. దాదాపు 38 కి.మీల దూరం ప్రయాణించాల్సి ఉంది. నా ఫోన్ బ్యాటరీ కూడా 6% మాత్రమే ఉంది. త్వరగా గమ్యస్థానానికి చేర్చాలని ర్యాపిడో డ్రైవర్‌ను కోరాను. కొంత దూరం వెళ్లాక బైక్ చెయిన్ తెగిపోయింది. రాత్రి వేళ కావడంతో ఎక్కడా మెకానిక్ షాపులు లేకపోవడంతో ఆందోళన కలిగింది. రైడ్‌ను క్యాన్సిల్ చేయమని చెప్పకుండా.. ఆ కెప్టెన్ దాన్ని రిపేర్ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. సురక్షితంగా మిమ్మల్ని ఇంటికి చేర్చుతా అని అతడు నాకు చెప్పాడు. బైక్ బాగు చేసిన తర్వాత తిరిగి రైడ్ ప్రారంభించాం. తెల్లవారుజామున 1 గంటకు నేను సురక్షితంగా ఇంటికి చేరాను' ఆషా పేర్కొంది. ఈ సందర్భంగా అర్ధరాత్రి వేళ మహిళలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ర్యాపిడో కెప్టెన్లను అభినందించాలని ఆమె తెలిపింది. దీనికి ఆ సంస్థను ట్యాగ్ చేసింది. ఈ పోస్టు కాస్త వైరల్ కావడంతో ర్యాపిడో సంస్థ స్పందించింది. 'వావ్. ఇది చాలా భిన్నంగా ఉంది. కొందరు రోడ్డుపై బైక్ చెడిపోయినా బాగు చేస్తారు. ప్రయాణికులను సురక్షితంగా ఇంటికి చేరేలా చూస్తారు. నమ్మకమైన ఈ క్షణాన్ని పంచుకున్న ఆషా మానేకు ధన్యవాదాలు. ఆ కెప్టెన్‌కు తగిన గుర్తింపు ఇస్తాం' అని ఎక్స్‌లో రాసుకొచ్చింది.

# స్మృతి మంధాన తండ్రి డిశ్చార్జి

భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యురాలు స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ ఆదివారం గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఈ కారణంగా మంధాన అదేరోజు మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో జరగాల్సిన తన వివాహాన్ని నిరవధికంగా వాయిదా వేసుకున్నారు. అయితే ప్రస్తుతం శ్రీనివాస్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ‘ ఆదివారం ఉదయం మంధాన తండ్రి బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఆయన్ను హాస్పిటల్‌లో చేర్చాం. మంధానకు తండ్రి అంటే చాలా ఇష్టం. అందుకే ఆమె ఈ పరిస్థితుల్లో తన వివాహం జరగడానికి ఒప్పుకోలేదు. తండ్రి ఆరోగ్యం బాగుపడేవరకు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు’ అని స్మృతి మంధాన మేనేజర్ తెలిపిన సంగతి విధితమే. తాజాగా అందిన సమాచారం ప్రకారం స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ ఆరోగ్యం మెరుగైంది. దీంతో ఆయన్ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలుస్తోంది. పలాశ్ ముచ్చల్ కూడా ఇన్‌ఫెక్షన్, అసిడిటీ కారణంగా ఆసుపత్రి పాలయ్యాడు. డిశ్చార్జి అయిన అనంతరం అతడు మళ్లీ అనారోగ్యానికి గురై హాస్పిటల్లో చేరాడు. స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురవడం వల్ల ఆందోళనతో ఒత్తిడికి లోనై.. తన కొడుకు ఆసుపత్రి పాలయ్యాడని పలాశ్ ముచ్చల్ తల్లి అమిత తెలిపారు. అయితే స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ వివాహానికి సంబంధించి మాత్రం ఇప్పటివరకైతే ఎటువంటి అప్‌డేట్ రాలేదు.








## భారీ లాభాల్లో సూచీలు

### సెన్సెక్స్ 1000 పాయింట్లు పైకి

ముంబయి: దేశీయ స్టాక్‌మార్కెట్‌లో చాలా రోజుల తర్వాత మంచి ర్యాలీ కనిపించింది. వరుసగా మూడు రోజుల నష్టాల అనంతరం నేడు దూసుకెళ్లిన సూచీలు.. భారీ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పాజిటివ్ సంకేతాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు ఈ ర్యాలీకి ప్రధాన కారణం. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 26,200 మార్కును దాటింది. ఈ క్రమంలోనే సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠాలకు కాస్త దూరంలో నిలిచాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్క సెషన్‌లో రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.475 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,503.44 పాయింట్ల (క్రితం ముగింపు 84,587.01) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల బాట పట్టింది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,644.19 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1022 పాయింట్ల లాభంతో 85,609.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 320.50 పాయింట్ల లాభంతో 26,205.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.25గా ఉంది. గతేడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978 వద్ద, నిఫ్టీ 26,277 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకాయి. రెండు సూచీలూ కాస్త దూరంలో నిలిచాయి. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లూ లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 62.21 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 4159 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

#### ర్యాలీకి కారణమేంటి?

- డిసెంబర్ నెల పాలసీ మీటింగ్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలు బలపడ్డాయి. రేట్ల కోతను బలపరిచేలా డేటా రావడంతో వడ్డీ ఈసారి రేట్లు తగ్గిస్తుందని 85 శాతం మంది అనలిస్టులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే మనలాంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు పెట్టుబడులు తరలివచ్చే అవకాశం ఉంటుంది. దీనికితోడు ఆర్‌బీఐ కూడా దేశీయంగా వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండడం సూచీలు రాణిస్తున్నాయి.
- వాల్‌స్ట్రీట్‌లో నిన్న కొనుగోళ్ల మద్దతు కనిపించింది. దీనికి కొనసాగింపుగా అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో కొనసాగుతున్నాయి. వాటితో పాటు మన మార్కెట్లూ భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి.
- అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడమూ మన సూచీలకు కలిసొచ్చింది. వచ్చే ఏడాది సప్లయ్ మరింత పెరుగుతుందన్న కారణంతో బ్రెంట్ క్రూడ్ 60 డాలర్లకు కాస్త ఎగువన ట్రేడవుతోంది. దీనికితోడు రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపు దశకు చేరుకోవడమూ మదుపర్లు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.
- విదేశీ మదుపర్లు కొనుగోళ్లు కూడా మన సూచీలకు కలిసొచ్చాయి. నవంబర్ 25న రూ.785 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది.




## కోచ్‌గా నా భవిష్యత్తుపై నిర్ణయం బీసీసీఐదే..

### గంభీర్ కీలక వ్యాఖ్యలు

టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా చేతిలో రెండో టెస్ట్‌లో 408 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇప్పటికే కోల్‌కతా టెస్ట్‌లో ఓడిపోయి, 0-1 తేడాతో సిరీస్‌లో భారత జట్టు వెనకబడింది. గువాహటి టెస్ట్‌లోనూ ఓడి 2-0 తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్ స్వీప్‌నకు గురైంది. సఫారీల జట్టు దాదాపు 25 సంవత్సరాల తర్వాత భారత్‌పై భారత్‌లో టెస్ట్ సిరీస్ నెగ్గింది. దీంతో మ్యాచ్ అనంతరం టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తాను కోచ్‌గా కొనసాగాలా.. వద్దా..? అనే విషయంలో బీసీసీఐనే నిర్ణయం తీసుకుంటుందన్నాడు. భారత క్రికెట్‌కే ప్రాధాన్యమని, వ్యక్తులకు కాదని చెప్పాడు. ‘కోచ్‌గా మీ భవిష్యత్తు ఏంటి?’ అని విలేకరులు అడిగిన ప్రశ్నపై గంభీర్ స్పందించాడు. ‘ఆ విషయమై బీసీసీఐనే నిర్ణయం తీసుకుంటుంది. ఇక్కడ దేశమే ప్రధానం. నేను కాదు. టీమ్ఇండియా.. ఇటీవల ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను సమం చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ సైతం గెలిచింది. అప్పుడు కూడా నేనే కోచ్‌గా ఉన్నా’ అని గౌతమ్ గంభీర్ సమాధానమిచ్చాడు. ‘టెస్ట్ క్రికెట్‌లో వైఫల్యంపై ఆటగాళ్లనో, లేదా ఏ ఒక్కరినో నిందించలేరు. పరాజయానికి అందరూ బాధ్యత వహించాల్సిందే. సుదీర్ఘ ఫార్మాట్లో రాణించాలంటే సమష్టి కృషి అవసరం’ అని గంభీర్ పేర్కొన్నాడు.

## టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోనే ఎందుకు? : ఆదిత్య ఠాక్రే



టీ20 వరల్డ్‌కప్ 2026 ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిన్న (మంగళ వారం) విడుదలైన షెడ్యూల్‌లో ప్రకటించారు. అయితే దీన్ని శివసేన నేత ఆదిత్య ఠాక్రే తప్పు పడుతున్నారు. దీన్ని పక్షపాత చర్యగా ఆయన అభివర్ణించారు. ‘ఎక్స్’ వేదికగా ఆయన ప్రశ్నించారు. ‘టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ వచ్చింది. ఫైనల్ జరిగే వేదిక ఏంటో తెలుసా? అహ్మదాబాద్. ఇదే వేదికపై ప్రతి ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించడానికి కారణం ఏంటి? అదేమన్నా సంప్రదాయ వేదికనా?’ అని ఆయన నిలదీశారు. ‘ఫైనల్ మ్యాచ్‌కు ముంబయి ఎందుకు వేదిక కాకూడదు. గతంలో టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ వాంఖడే స్టేడియంలోనే జరిగింది. పక్షపాత రాజకీయాల్లో ఐసీసీ భాగం కాకూడదనుకుంటున్నా. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం (చెపాక్) స్టేడియం, మొహాలిలోని ఐఎస్ (ఇంద్రజిత్ సింగ్) బింద్రా స్టేడియం.. ఇవి టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ నిర్వహించడానికి అనువైన స్టేడియాలు. కానీ రాజకీయాల వల్ల మేం అన్యాయానికి గురవుతున్నాం’ అని ఆదిత్య ఠాక్రే పేర్కొన్నారు. అలాగే 2023లో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ అహ్మదాబాద్ వేదికగానే జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో టీమ్ఇండియా ఓటమి పాలైంది.



## ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్.. భారత్‌కు రజతం

**పట్టాయా :** థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో జరిగిన ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్ రజత పతకం సాధించింది. టీమ్ డ్రెస్సేజ్ విభాగంలో ఈ పతకం దక్కింది. గౌరవ్ పుండీర్ (ఉత్తరప్రదేశ్), దివ్యకృతి సింగ్ (రాజస్థాన్), శృతి వోరా (మహారాష్ట్ర)లతో కూడిన భారత బృందం కేవలం 0.2 శాతం పాయింట్ల తేడాతో స్వర్ణాన్ని కోల్పోయింది. టోర్నీకి ఆతిథ్యమిస్తున్న థాయ్‌లాండ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, హాంకాంగ్ కాంస్యం సాధించింది.




# టీమ్ఇండియా ఘోర ఓటమి

- 408 పరుగుల తేడాతో సఫారీల చేతిలో పరాజయం
- 2-0తో సిరీస్ వైట్‌వాష్



**గువాహటి :** గువాహటి టెస్ట్‌లో టీమ్ఇండియా 140 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో విజయం సాధించింది. సైమన్ హార్మర్ ఆరు వికెట్ల ప్రదర్శన చేశాడు. టీమ్ఇండియా బ్యాటర్లలో రవీంద్ర జడేజా (54, 87 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్సులు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. దీంతో సిరీస్‌ను 2-0తో టీమ్ఇండియా కోల్పోయింది. దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. దాదాపు 25 ఏళ్ల తర్వాత తొలిసారిగా సఫారీల జట్టు భారత్‌లో భారత్‌పై టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించింది. 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో అయిదో రోజు ఆటను ప్రారంభించిన టీమ్ఇండియా చకచకా వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఒకానొక దశలో 58 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయి, కుప్పకూలేలా కనిపించిన భారత జట్టు.. రవీంద్ర జడేజా పోరాడటంతో ఈ మాత్రమైనా స్కోర్ చేయగలిగింది. సాయిసుదర్శన్ (14) 139 బంతుల పాటు క్రీజులో పాతుకుపోయినా ప్రయోజనం లేకపోయింది. యశస్వి జైస్వాల్ (13), కేఎల్ రాహుల్ (6), ధ్రువ్‌జురేల్ (2), రిషభ్ పంత్ (13), వాషింగ్టన్ సుందర్ (16), నితీశ్ కుమార్ రెడ్డి (0) ఇలా బ్యాటర్లందరూ గంపగుత్తగా విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో సైమన్ ఆర్మర్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 37 పరుగులిచ్చి 6 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. కేశవ్ మహరాజ్ 2, ముత్తుసామి, మార్కో యాన్సెన్ తలో వికెట్ తీసుకున్నారు. దక్షిణాఫ్రికా తొలిఇన్నింగ్స్‌లో 489 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 260/5 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. మొదటి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 201 పరుగులకు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 140 పరుగులకే ఆలౌటైంది. ఇప్పటికే కోల్‌కతా టెస్ట్‌లో గెలిచిన దక్షిణాఫ్రికా, గువాహటిలోనూ విజయకేతనం ఎగురవేసి సిరీస్‌ను కైవసం చేసుకుంది. టెస్టుల్లో టీమ్ఇండియాకు పరుగుల పరంగా ఇదే అతి పెద్ద ఓటమి. ఇంతకు ముందు భారత జట్టు 2004లో నాగ్‌పూర్ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో 342 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

## టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్స్‌కు భారత్ వెళ్తుంది : రోహిత్ శర్మ



రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్ఇండియా టీ20 వరల్డ్ కప్ 2024ను కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా మీద ఏడు పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. గతంలో 2007లో ఎం.ఎస్.ధోని నాయకత్వంలో తొలి టీ20 వరల్డ్‌కప్‌ను భారత్ సొంతం చేసుకుంది. ఆ జట్టులో రోహిత్ శర్మ కూడా సభ్యుడిగా ఉన్నాడు. తిరిగి 17 సంవత్సరాల అనంతరం 2024లో టీమ్ఇండియా రోహిత్‌శర్మ నాయకత్వంలో పొట్టి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయం తర్వాత రోహిత్ తన టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. తాజాగా టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నీకి సంబంధించిన షెడ్యూల్ నిన్న (మంగళవారం) విడుదలైంది. ఈ కార్యక్రమంలో రోహిత్ శర్మ పాల్గొన్నాడు. అలాగే అతడు ఈ మెగా టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా నియమితుడయ్యాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ‘2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ అహ్మదాబాద్‌లో జరిగింది. దేవుడి దయతో మేము ఆ ఫైనల్‌లో గెలిచి కప్‌ను సొంతం చేసుకున్నాం. దాదాపు ఎనిమిది నెలల తర్వాత మరో ఐసీసీ ట్రోఫీ గెలిచాం. అలాగే రానున్న టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో టీమ్ఇండియా కచ్చితంగా ఫైనల్‌కు వెళ్తుంది. ఫైనల్‌లో భారత జట్టు ఏ టీమ్ మీద ఆడినా.. చూడ్డానికి బాగుంటుంది. నేను కచ్చితంగా భారత జట్టు ఫైనల్‌లో ఆడుతుందని ఆశిస్తున్నా. ఏం జరుగుతుందో చూద్దాం..’ అని రోహిత్ అన్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టోర్నమెంట్ జరగనుంది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్ కొలంబో వేదికగా ఫిబ్రవరి 15న జరగనుంది.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్.. మళ్లీ అగ్రస్థానంలో రోహిత్

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ (781 రేటింగ్ పాయింట్లు) వన్డే ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. గతవారం టాప్‌లో నిలిచిన న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ (766) రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, చివరి రెండు వన్డేల్లో డారిల్ మిచెల్ ఆడకపోవడంతో రేటింగ్ పాయింట్లను కోల్పోయాడు. మరో నాలుగు రోజుల్లో సౌతాఫ్రికాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ ఆడనున్నాడు. ఆ మ్యాచ్‌ల్లో రాణిస్తే హిట్‌మ్యాన్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంటాడు. అఫ్గాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ మూడు, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్ ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయాడు. కేఎల్ రాహుల్ 16వ ర్యాంక్‌లో ఉన్నాడు. టీ20 ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే ప్లేయర్ సికిందర్ రజా కెరీర్‌లో తొలిసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు.




## హెచ్‌పీలో ఉద్యోగాల కోతలు

### 6వేల మందికి లేఆఫ్‌లు..

టెక్ రంగంలో ఉద్యోగులకు ఈ ఏడాది కూడా కష్టకాలమే కొనసాగుతోంది. దిగ్గజ కంపెనీలు వరుసగా లేఆఫ్‌లు ప్రకటించడం ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది ఆర్థికమాంద్యం భయాలతో వేలాదిమందిని తొలగించిన సంస్థలు.. ఇప్పుడు కృత్రిమ మేధని అందిపుచ్చుకునేందుకు మళ్లీ కోతలు మొదలుపెట్టాయి. తాజాగా ప్రముఖ పీసీ, ప్రింటర్ తయారీ సంస్థ హెచ్‌పీ కూడా ఈ జాబితాలో చేరింది. వచ్చే రెండు-మూడేళ్లలో 6 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించింది. కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచే క్రమంలో ఈ లేఆఫ్‌ల నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్యను 4000 నుంచి 6000 మేర తగ్గించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. సంస్థలో మొత్తం ఉద్యోగుల్లో ఈ కోతలు 10 శాతానికి సమానం కావడం గమనార్హం. 2024 అక్టోబరు నాటికి హెచ్‌పీకి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 58వేల మంది ఉద్యోగులున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండనున్నట్లు కంపెనీ సీఈఓ ఎన్రిక్ లోరెస్ వెల్లడించారు. “కంపెనీ పోటీలో ఉండాలంటే మేం ఈ చర్యలు చేపట్టక తప్పట్లేదు. ఈ నిర్ణయంతో ఒక బిలియన్ డాలర్ల మేర ఖర్చు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నాం” అని లోరెస్ పేర్కొన్నారు. కాగా.. ఈ ఏడాది ఆరంభంలోనూ హెచ్‌పీ దాదాపు 1000-2000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసింది. కంపెనీ పునర్‌నిర్మాణ ప్రణాళికల్లో భాగంగా ఈ కోతలు చేపట్టినట్లు నాడు పేర్కొంది. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో హెచ్‌పీ ఉత్పత్తుల తయారీ ఖర్చులు పెరుగుతున్నాయి. దీనికి తోడు కస్టమర్లు ఏఐ ఫీచర్ల కోసం పాత కంప్యూటర్లను మార్చుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో కంపెనీపై మెమొరీ చిప్‌ల ధరల భారం పడుతోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఖర్చు తగ్గింపు చర్యలు చేపడుతున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అయితే, తాజా ప్రకటనతో హెచ్‌పీ షేర్లు కుదేలయ్యాయి. మంగళవారం నాటి అమెరికా మార్కెట్లలో ఈ కంపెనీ షేరు దాదాపు 5.5శాతం మేర కుంగాయి.

# 100 మిలియన్ వ్యూస్‌ని క్రాస్ చేసిన 'పెద్ది' చికిరి చికిరి సాంగ్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భారీ పాన్-ఇండియా మూవీ పెద్ది నుండి ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి సాంగ్ ప్రపంచవ్యాప్తంగా ఒక వేడుకగా మార్చింది. విడుదలైన నిమిషం నుండే ఈ పాట ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను అదరగొట్టింది. అకాడమీ అవార్డు విన్నర్ ఎ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన చికిరి చికిరి ఖండాలలో ప్రతిధ్వనించింది. భాషా సరిహద్దులను అప్రయత్నంగా దాటింది. వైరల్ బీట్‌లు, జానపద-మూలాలున్న పల్స్, సినిమాటిక్ సౌండ్‌స్కేప్ ప్రపంచంలోని ప్రతి మూల నుండి శ్రోతలను అలరించాయి. అన్ని భాషల్లో సాంగ్ 100ం మిలియన్ల వ్యూస్ ని క్రాస్ చేసింది.తెలుగు వెర్షన్ సాంగ్ ముందంజలో ఉంది. దాదాపు 64 మిలియన్ వ్యూస్, 1 మిలియన్‌కు చేరువైన లైకులతో దూసుకెళ్తూ, రామ్‌చరణ్ అసమానమైన క్రేజ్‌ను మరోసారి నిరూపించింది. హిందీ వెర్షన్ కూడా 25 మిలియన్ వ్యూస్‌తో బలంగా నిలవగా, తమిళ్, కన్నడ, మలయాళం వెర్షన్లు కలిపి మరో 10 మిలియన్ వ్యూస్‌ను యాడ్ చేశాయి. దీంతో ఈ పాట పాన్-ఇండియా స్థాయిలో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.ఈ సంచలనానికి అసలు హైప్ తెచ్చింది రామ్‌చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్, అద్భుతమైన డాన్స్ స్కిల్స్, మ్యాగ్నెటిక్ ఆరా. ఈ పాటలో రా, రస్టిక్‌గా పవర్ ఫుల్ గ్రేస్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఆయన స్టెప్స్‌ను వేలాది మంది అభిమానులు రీక్రియేట్ చేస్తుండగా, సోషల్ మీడియాలో చికిరి ఫెస్టివల్ కొనసాగుతోంది . హై ఎనర్జీ డాన్స్ రీల్స్ నుంచి స్టైలిష్ ఎడిట్స్, ఫ్యాన్ ట్రిబ్యూట్స్ వరకూ టైమ్‌లైన్లు నిండిపోతున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న పెద్ది విడుదలకు ముందే భారీ హైప్ సృష్టించింది. తొలి సింగిల్‌నే గ్లోబల్ చార్ట్‌బస్టర్‌గా మారడంతో, సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్ని తాకాయి. రాబోయే ఏడాది పెద్ది బిగ్గెస్ట్ గ్లోబల్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ప్రభాస్ సినిమాలో ఆఫర్ రావడాన్ని నమ్మలేదు

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోన్న ఈ మూవీలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌తో పాటు రిద్ధి కుమార్ కూడా హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన ట్రైలర్, టీజర్‌లో ఈ హీరోయిన్స్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ రిద్ధి కుమార్.. అసలు ఈ సినిమాలో తాను ఎలా భాగం అయిందో చెప్పుకొచ్చింది. మేము ప్రభాస్‌తో సినిమా చేస్తున్నాము.. అందులో మిమ్మల్ని హీరోయిన్‌గా కోరుకుంటున్నాము మీకు ఇష్టమేనా అని అడిగారు. అది వినగానే నేను ఫ్రాంక్ కాల్ అనుకున్నా. నా మేనేజర్‌తో వెరిఫై చేయడానికి ఫోన్ చేయించాను. అప్పుడు వాళ్లు "మీకు ప్రభాస్ తెలుసా?" అని అడిగారు. నేను "అవును!" అని అన్నాను. లుక్ టెస్ట్ ఇవ్వమంటే ఇచ్చాను.. ఆడిషన్ చేశారు.. దీంతో ఈ రోజు నేను ఇక్కడ ఉన్నాను.. నిజంగా దీన్ని నేను నమ్మలేకపోయాను.. ప్రభాస్ నటిస్తున్న ది రాజాసాబ్‌లో నేను భాగం కావడం నిజంగా చాలా సంతోషంగా ఉంది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది రిద్ధి కుమార్.

# 4రోజుల్లో రూ9.08 కోట్ల గ్రాస్ వసూళ్లు

## ఘన విజయాన్ని దక్కించుకున్న "రాజు వెడ్స్ రాంబాయి"

అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించిన "రాజు వెడ్స్ రాంబాయి" సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని దక్కించుకుంది. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ ఈ సినిమాకు ప్రశంసలు అందిస్తున్నారు. ఈ సినిమా మంచి ఓపెనింగ్స్ తో బాక్సాఫీస్ జర్నీ మొదలుపెట్టింది. 4 రోజుల్లో ఈ సినిమాకు 9.08 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కాయి. ఈ సినిమాకు రోజు రోజుకూ కలెక్షన్స్ పెరుగుతున్నాయి. మొదటి రోజు కంటే రెండో రోజు, రెండో రోజును మించిన వసూళ్లు మూడో రోజు, మూడో రోజును మించి నాలుగో రోజు ఈ చిత్రానికి కలెక్షన్లు దక్కాయి. వీక్ డేస్ లోనూ "రాజు వెడ్స్ రాంబాయి" బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ హోల్డ్ తో రన్ అవుతుండటం విశేషం."రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చారు.



# ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం



ప్రముఖ నటి సమంత, మహిళలపై ఆన్‌లైన్‌లో పెరుగుతున్న వేధింపులను ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. ఈ లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేస్తున్న యూఎన్ విమెన్ ఇండియా'తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మహిళలపై డిజిటల్ ప్రపంచంలో జరుగుతున్న హింసను నివారించేందుకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ జరుగనున్న 16 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు సమంత ఇప్పటికే తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా తన 37 మిలియన్ల అనుచరులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను వెల్లడించారు. సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, బెదిరింపులు, డీప్ ఫేక్ చిత్రాలు వంటి అనేక రూపాల్లో మహిళలు దాడులకు గురవుతున్నారు. గతంలో ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ ప్రపంచానికి మారాయి. ఇవి మనసును దెబ్బతీసేలా, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేలా ఉంటాయి," అని సమంత భావోద్వేగంతో తెలిపారు. తాను కూడా ఇలాంటి పరిస్థితులను పలుమార్లు ఎదుర్కొన్నానని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మహిళల్లో ఆన్‌లైన్ హింసపై అవగాహన పెంపొందించడం అని సమంత వివరించారు. డిజిటల్ వేధింపులను అరికట్టేందుకు మరింత ప్రభావవంతమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు తప్పనిసరిగా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. యూఎన్ విమెన్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగం కావడం తనకు గర్వకారణమని సమంత పేర్కొన్నారు.

# సంక్రాంతి రేసులో శర్వానంద్ సినిమా



చార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం 'నారి నారి నడుమ మురారి' సినిమాతో బిజీగా ఉన్నాడు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రజెంట్ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతోగానో ఆకట్టుకోగా.. ఈ చిత్రం సంక్రాంతి బరిలో రాబోతున్నట్లు ఇప్పటికే అప్డేట్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పుడు ఈ రిలీజ్ డేట్‌పై కొన్ని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నారి నారి నడుమ మురారి చిత్రం సంక్రాంతికి రిలీజ్ అవ్వడం అనేది ఇప్పుడు పూర్తిగా దాని ఒప్పందంపై ఆధారపడి ఉందట. ఒప్పందం కుదిరితే ఈ చిత్రం అధికారికంగా పండుగ రేసుకు వస్తుందని నెట్టింట వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ చిత్రం ఓటీటీ డీల్ కంప్లీట్ కాకపోతే.. సంక్రాంతి రేసులో ఉండకపోవచ్చని సమాచారం. అయితే.. ఒప్పందం కుదిరేలోపు తుది కాపీ సిద్ధంగా ఉన్నందున మిగిలిన షూటింగ్‌ను వచ్చే వారం తిరిగి ప్రారంభించడానికి బృందం సన్నాహాలు చేస్తోందని టాలీవుడ్ వర్గాల నుంచి టాక్. ఇక ఈ సినిమా ఓటీటీ డీల్‌పై ఏదో ఒక అప్డేట్ వస్తే కానీ 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతికి వస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# ఆస్కార్ రేసులో మహావతార్ నరసింహా..!

సినీ ప్రపంచంలో సంచలనాన్ని రేపిన యానిమేషన్ చిత్రం మహావతార్ నరసింహా' విడుదలైన సమయంలో,భారత్‌లో యానిమేషన్ సినిమాలు పెద్దగా ఆదరణ పొందవని భావన ఉండేది. అయితే ఆ అంచనాలను పూర్తిగా తారుమారు చేస్తూ ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని హెూంబలే సంస్థ సుమారు రూ.40 కోట్ల బడ్జెట్‌తో నిర్మించింది. థియేటర్లకు వచ్చిన వెంటనే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా, దేశవ్యాప్తంగా భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీర్ఘకాలిక ప్రదర్శనలో రూ.325 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అనేక రికార్డులను తిరగరాసింది. ఇప్పటికే తనదైన మార్క్ వేసుకున్న మహావతార్ నరసింహా' ఇప్పుడు మరో అరుదైన ఘనతను అందుకుంది ు అదే ఆస్కార్ రేసులో ప్రవేశించడం. ఇటీవల ప్రకటించిన ఆస్కార్ ప్రాథమిక జాబితాలో ఈ చిత్రానికి స్థానం దక్కింది. యానిమేషన్ విభాగంలో మొత్తం 35 చిత్రాలు నామినేషన్ కోసం పోటీపడుతున్నాయి. ఆ జాబితాలో మహావతార్ నరసింహా' కూడా ఉండటం గర్వకారణం. ఈ 35 చిత్రాల్లోంచి ఒక్కటిని అధికారిక నామినేషన్ కోసం ఎంపిక చేస్తారు. ఆ ఎంపికలో మహావతార్' నిలిస్తే, ఇండియా నుంచి ఆస్కార్ నామినేషన్‌కు ఎంపికైన తొలి యానిమేషన్ చిత్రం అనే చరిత్ర సృష్టిస్తుంది. అంతేకాక, నామినేషన్ దశను దాటితే, అవార్డు అందుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.







# ఎన్టీఆర్ సినిమా టైటిల్ డ్రాగన్ కాదా?

టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న సినిమా డ్రాగన్ . ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా మూవీపై సినీ వర్గాల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో కాంతార' బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఫస్ట్ లుక్‌లు అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేరాయి. అయితే, ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కు డ్రాగన్' అనే పేరు ఫైనల్ కాలేదని నిర్మాతలు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం వర్కింగ్ టైటిల్ డ్రాగన్' అనే పేరు పెట్టారు. ఈ సినిమా 2024 చివర్లో అధికారికంగా అనౌన్స్ అయినప్పటికీ, ప్రిత్విరాజ్ సుకుమారన్, రాజమౌళి వంటి వాళ్లు డ్రాగన్' అని పలు సందర్భాల్లో ప్రస్తావించడంతో ఆ పేరే ఫైనల్ అన్న అభిప్రాయం ఏర్పడింది. దీంతో యాక్షన్, మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థియేటర్లలో కట్టిపడేస్తుందని ఇండస్ట్రీలో గట్టి నమ్మకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ మూవీ టైటిల్ ఫైనల్ కాలేదని నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ స్పష్టం చేశారు.తాజాగా నిర్మాత మైత్రి రవి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.." డ్రాగన్' కేవలం టెంటేటివ్ టైటిల్స్‌లో ఒకటి మాత్రమే. ఇంకా చాలా ఆప్షన్స్ పరిశీలిస్తున్నాం. మూవీ స్కేల్, ఎన్టీఆర్ క్యారెక్టర్ డిమాండ్‌కు తగ్గట్టు అంతర్జాతీయ స్థాయి టైటిల్ ఫిక్స్ చేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జోరుగా సాగుతోంది.

# ఎన్‌బీకే111 గ్రాండ్ లాంచ్



వరుస బ్లాక్‌బస్టర్‌ల దూసుకెళ్తున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, వీరసింహారెడ్డి సంచలన విజయం తర్వాత బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేనితో మరోసారి చేతులు కలిపారు. ఈ ఇద్దరి కొలాబరేషన్ లో హిస్టారికల్ ఎపిక్ ఎన్‌బీకే111 చిత్రాన్ని ప్రతిష్టాత్మక వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు.బాలకృష్ణ సరసన నయనతార కథానాయికగా నటిస్తున్నారు. సింహా, జై సింహా, శ్రీ రామరాజ్యం తర్వాత బాలకృష్ణ, నయనతార కలిసి నటిస్తున్న నాల్గవ చిత్రం ఇది. ఈ ప్రాజెక్టు బుధవారం రోజున హైదరాబాద్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందజేశారు. బాలకృష్ణతో అనేక బ్లాక్‌బస్టర్‌లను అందించిన దర్శకుడు బి గోపాల్ క్లాప్ కొట్టారు. బాలయ్య కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్‌కు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చి బాబు సమిష్టిగా దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, నిర్మాతలు అనేక మంది ప్రముఖ అతిథులు హాజరయ్యారు.గోపిచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ డ్రామాలోకి అడుగుపెడుతున్నారు. కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్ రూపొందించే తన ప్రత్యేక మాస్ టచ్‌ను ఒక భారీ చారిత్రక కథలో మిళితం చేస్తూ, నందమూరి బాలకృష్ణను ఇప్పటివరకు చూడని ఓ కొత్త అవతార్ చూపించబోతున్నారు. స్పెషల్ పోస్టర్ లో బాలకృష్ణ.. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో యాంకర్ పట్టుకుని అఖండమైన రాజసంతో కనిపించారు. గడ్డం, పొడవాటి జుట్టు, శక్తివంతమైన తీరుతో సమరశూరుడిలా అదరగొట్టారు.హిస్టారికల్ ఎపిక్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, అద్భుతమైన యాక్షన్, విజువల్ వండర్ గా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచబోతోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com